J/NELLORE/003/24-26 R.N.I.No.25359/74 పేజీలు : 16

THE BEST TELUGU WEEKLY OF NELLOREANS

Best Wishes to
LAWYER
GVK

# లాయర్

సంపుటి : 46 సంచిక : 1 5.6.2026, శుక్రవారం వెల : రూ. 10/- వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంపాదకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి



Late. **Tunga RajaGopalaReddy** Garu
Founder, Lawyer Weekly

లాయర్ 45 YEARS

We wish
the epitome of honesty
LAWYER PATRIKA
on it's successful
completion of 45 years.



**G.V.K. Reddy**
Chairman

GVK
GROUP

# ఓ పాటలబ్బాయీ!.. ఎక్కడున్నావయ్యా!..



బాలూకో ప్రేమలేఖ

**బాలూ!..**

ఎక్కడున్నావయ్యా?..
ఏ గంధర్వలోకంలోనో
విహరిస్తూ.. ఆ గంధర్వులే
మైమరచిపోయేలా
పాటలు పాడుతూ కూర్చున్నావా ఏంది?..

ఒకసారి గతంలో నువ్వున్న ఈ భూలోకంలోకి.. మా లోకంలోకి కూడా తొంగిచూడు. నీ కోసం నేనెంతగా కలవరిస్తున్నానో.. పలవరిస్తున్నానో నీకు అర్థమవుతుంది. నా మనసెప్పుడూ నీ గురించే ఆలోచిస్తూ ఉంటుందని, నీ మాటలే వింటూ, నీ పాటల్లోనే నిన్ను చూసుకుంటూ నేను మురిసిపోతుంటానని మరచిపోయావా?..

చిన్నప్పటి నుంచి నిన్ను చూస్తూనే ఉన్నాను కదా.. అందుకే, నిన్ను మరచి పోలేకపోతున్నానయ్యా!.. మహానుభావా!...

అల్లరిచిల్లరగా ఆడుతూ పాడుతూ, పాటలు పద్యాలు అంటూ వాటి కొంగుపట్టుకు తిరుగుతున్నప్పుడు... మీ నాన్న గారు.. పెద్దాయన.. భలే నిష్ఠగా ఉండేవారులే.. ఆయన్ను చూస్తే నాక్కూడా భయమే!.. ఆయన నిన్ను 'పోరా పో.. ఎప్పుడూ ఆ పిచ్చి పాటలేనా.. హాయిగా ఏ దేవుడి కీర్తనలో పాడుకోక'.. అంటూ చిర్రుబుర్రులాడినప్పుడు కూడా..నువ్వు తమాషాగా నవ్వుతుంటే.. ఎంత బాగున్నావో... నేనంతా చూశానులే!..

పాటల తోటలో ఆడుతున్నప్పుడు, త్యాగరాజ ఉత్సవాలప్పుడు గోడలమీద కూర్చుని నువ్వు పాటలు పాడుతున్నప్పుడు.. 'నా పాట విన్నవాళ్ళకి 'టీ ఫ్రీగా ఇప్పిస్తా.. రండిరా రండి'..అంటూ అదేపనిగా పాటలు పాడి పాడి పిలకాయలనంతా వెంటేసుకుని పెద్దగా నవ్విస్తున్నప్పుడు'.. నేను కూడా అవన్నీ చాటుగా వింటూ నిన్నూ.. నీ ముద్దుమాటలనీ చూసి ముసిముసిగా నవ్వుకున్నానులే!..

అయినా ఆ తర్వాత.. ఆ పాటలబ్బాయేనా.. ఇంతగా పెరిగింది. హిమాలయాలు తలెత్తి చూడాల్సినంతగా ఎంత ఎత్తుకు పెరిగాడో కదా.. అని ప్రపంచమంతా పొగుడుతూ ఉంటే, ఎంత గర్వపడ్డానో తెలుసా!.. వెంటనే నిన్ను గుండెలకు హత్తుకోవాలని నా మనసెంత ఆరాటపడిందో.. నీకు తెలిస్తేగా!..

నువ్వే ఒక గానగంధర్వుడివైనా, దేశదేశాల్లో పాటలు పాడేవాళ్ళందరినీ తీసుకొచ్చి, వాళ్లకి పూలగుత్తులతో సన్మానాలు చేసి, అంతలావు మనిషివి.. పూర్తిగా వంగిపోయి.. వాళ్ళ కాళ్ళకి కూడా మొక్కావే.. నువ్వు మనిషివేనా అసలు?.. నీకు-ఆ దేవుడికీ తేడా ఏముంది?.. నువ్వో మహాయోగివయ్యా బాలూ!.. కాకుంటే పాటల బాటసారివి. ప్యాంటూ షర్టూ వేసుకుంటే ఎంతటి యోగి అయినా.. సినిమా హీరోలా కనిపిస్తాడు కదూ!.. నువ్వూ అంతే!...

సినీ సంగీతసామ్రాజ్యానికి నువ్వే 'మణి'మకుటమైనా.. వేలపాటలు పాడి..వేలాదిమందికి పాటలెలా పాడాలో తెలిపిన సంగీతవేత్తవయినా.. ఏమీ తెలియనివాడిలా.. ఉత్త అమాయకుడిలా ఎంత బాగా నటిస్తావో!.. చూస్తుంటే.. ఎంత ముద్దొస్తావో!...

సరే!.. ఇప్పుడిదంతా ఎందుకు చెప్తున్నానంటే, నిన్నెంతగానో అభిమానించి ఆరాధించే మా నెల్లూరోళ్ళంతా కలసి.. ఇప్పుడు నువ్వు లేకున్నా.. నీమీద ఎనలేని ఆత్మీయతతో.. అభిమానంతో నీ రూపాన్ని పెట్టి.. ఓ విగ్రహంగా కట్టి.. అదిగో!.. నీకిష్టమైన అన్నమయ్య విగ్రహం వద్దనే పెడుతున్నారు. 'యద్భక్తా యత్ర గాయంతి'.. అన్నట్లుగా.. భక్తులు ఎక్కడ తనగురించి పాటలు పాడుతుంటే .. ఆ దేవుడు కూడా అక్కడికే వచ్చి కూర్చుంటాడని నువ్వే మీటింగుల్లో చెప్తుంటే నేను విన్నాగా!.. నువ్వేమన్నా తక్కువా?..నువ్వూ అంతే!.. నీ స్నేహితులు, ఆత్మీయులు ఎక్కడుంటే నువ్వూ అక్కడే గంటల తరబడి కాదు, రోజుల తరబడైనా కూర్చుంటావు.

అవును!.. నెల్లూరంటే నీకు ఎక్కడలేని ప్రేమ! నువ్వంటే నెల్లూరుకూ అంతే ఇష్టం. అందుకే, ఇప్పుడు నెల్లూరులో అందరూ నిన్నే తలచుకుంటున్నారు. నువ్వు చెప్పిన మాటలని, పాడిన పాటలని పెద్దపెద్ద వాళ్ళంతా వచ్చి పాడుతున్నారు. మద్రాసు నుంచి వచ్చిన నీవాళ్లయితే.. నిన్ను తలచుకుని, నువ్వు లేవనే బాధతో.. ఎవరూ చూడకుండా.. కన్నీళ్ళు పెడుతున్నారు కూడా. అయితే, నేను అక్కడికి రాలేకపోతున్నందుకు సారీ!.. నా బాలూవు కదూ!.. ఏమీ అనుకోకేం?..

ఇదిగో ఒక మాట!.. నీ వాళ్ళందరినీ చూసుకుంటూ.. కాంస్య విగ్రహం కట్టారు కదా అని.. అక్కడే మైమరిచిపోయి శిలైపోకుండా.. అప్పుడప్పుడూ..ఇక్కడకి కూడా వచ్చిపోతుండేం!..ఎవరికీ చెప్పకపోయినా పర్వాలేదులే!.. నా దగ్గరికి నువ్వొస్తే నిన్నెవరూ ఏమీ అనుకోరులేబ్బా!.. 'వసంతం కాడకి తాను పోలేకపోయినా.. వసంతమే వనాల దగ్గరకి నడిచొస్తుందని' సిరివెన్నెల చెప్పాడని, పాటకచ్చేరీల్లో నువ్వే కదా చెప్పావు. నువ్వు కూడా అలా అలా నడచి రావచ్చు కదా!..నువ్వొస్తే నెల్లూరంతా వసంతగానమే కదా!...

అయినా, ఎన్నాళ్ళయ్యిందో నిన్ను చూసి!.. ఒక్కసారి నాకోసం వస్తావు కదూ!.. నిన్ను చూడాలని ఉందయ్యా!.. నీ పాటలతో పులకించినదాన్ని.. నీ మాటలతో పరవశించినదాన్ని.. నీ పుట్టినరోజు పండగల్ని చూసి మురిసిపోయినదాన్ని!... నీకోసం కళ్ళు కాయలు కాచేలా ఎదురు చూస్తున్నా!.. ఒక్కసారి వచ్చిపో బాబూ...



...ఇట్లు!

నీకు ప్రియమైనదాన్ని.. ప్రియాతిప్రియమైనదాన్ని..
నీ ప్రేమ మందిరాన్ని... నెల్లూరు పురమందిరాన్ని!

(జూన్ 4.. బాలూ 80వ జయంతి.. సందర్భంగా)

# ప్రజలని మభ్యపెడుతున్న ప్రభుత్వం



పర్వతరెడ్డి

కూటమి ప్రభుత్వం ప్రజలను మాయమాటలతో మభ్యపెడుతోందని, సూపర్ సిక్స్ హామీలు ఏమయ్యాయో ప్రభుత్వం సమాధానం చెప్పాలని వైసీపీ నేత, నెల్లూరు నగర వైసీపీ ఇన్‌చార్జి పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి విమర్శించారు. ఈనెల4న నెల్లూరు లోని ఓల్డ్ చెక్‌పోస్ట్ సెంటర్‌లో వైసీపీ ఆధ్వర్యంలో 'వెన్నుపోటుకు రెండేళ్లు' నిరసన కార్యక్రమం నిర్వహించారు. పర్వతరెడ్డి మాట్లాడుతూ, ఆడబిడ్డ నిధి, నిరుద్యోగ భృతి, 50ఏళ్లకే మహిళలకు పెన్షన్ లాంటి హామీలు అమలు చేయకుండా ప్రభుత్వం ప్రజలను దగా చేసిందని ధ్వజమెత్తారు. కూటమి ప్రభుత్వ అబద్ధపు హామీలకు రెండేళ్లు పూర్తయిందని విమర్శిస్తూ ఆయన ఆధ్వర్యంలో పోస్టర్‌ను ఆవిష్కరించారు.



# డాక్టర్ విరాజితకు స్వర్ణపతకం!

నెల్లూరు జిల్లా ఆత్మకూరు మున్సిపాలిటీ వెంకట్రావుపల్లికి చెందిన డాక్టర్ పందల విరాజితకి ఎం.డి జనరల్ మెడిసిన్‌లో డాక్టర్ ఎన్టీఆర్ వైద్య ఆరోగ్య విశ్వవిద్యాలయం వారి స్వర్ణ పతకం లభించింది. ఈ సందర్భంగా ఆమెను ఏపీ మెడికల్ కౌన్సిల్ చైర్మన్ ప్రొ. దగ్గుబాటి శ్రీహరిరావు, ఎన్టీఆర్ హెల్త్ విశ్వవిద్యాలయం కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ డా. శ్రీకాంత్, ఎస్వీ ఆయుర్వేదిక్ వైద్యకళాశాల వైస్‌ప్రిన్సిపాల్ ప్రొ.విజయభాస్కర్‌రెడ్డి, ఏబిఆర్ఎస్ఎమ్ రాష్ట్ర అధ్యక్షులు ప్రొఫెసర్ వై.వి.రామిరెడ్డి అభినందించారు.

# వరప్రసాదరెడ్డి హృదయస్పందనే.. 'ధర్మపత్నీ సమేతస్య'




ఆయన తెలుగువారి 'వర'ప్రసాదమైతే, వరప్రసాద జీవన ప్రాసాదంలో సరికొత్త వసంత గానం ఆయన సతీమణి 'వసంత'. ఆమె అంటే ఆయనకు మమకారం, ఎనలేని గౌరవం. ఆమె 75వ వసంతంలోకి అడుగిడిన శుభవేళ ఆయన ఆర్తితో పులకించి తరించిపోయారు. అర్ధాంగిలో మాతృమూర్తిని సందర్శించిన అభిజ్ఞుడు, సంస్కార హృదయుడు వరప్రసాదరెడ్డి.

అందుకే ఆయన జీవన 'వసంతం'పై సుమధురగీతం రచించి వచించి అందులో కృతజ్ఞతాభివందనలు అర్పించారు సతీమణి వసంతకు. ఆ పాట ఎంతో ఆర్ద్రంగా సరికొత్త ఒరవడితో సాగింది. తొలుత అక్షర ప్రేమికుడిగా సాహితీ పిపాసిగా అందరికీ తెలిసిన వరప్రసాదరెడ్డి అక్షర సైనికుడై గీత రచన చేయడం అభిలషణీయం. అర్ధాంగి పట్ల కృతజ్ఞతలు చెల్లిస్తూ, అమ్మ సగమైతే అర్ధాంగి సగమని, అమ్మంటే భక్తిని అర్ధాంగి పట్ల ఆరాధనను ప్రకటించి నూతన ఒరవడికి, సరికొత్త బడికి శ్రీకారం చుట్టిన సమున్నతుడు, భావసంపన్నుడు కూడా వరప్రసాదరెడ్డి.

అతివల పట్ల అగణిత ప్రేమాభిమాన మనస్కుడు ఆయన. అర్ధనారీశ్వరతత్వంతో 'ఆమె'ను అభిషిక్తించిన ఈశ్వర వరప్రసాద్ రెడ్డి అభినందనీయుడు. తన శ్రీమతి వసంతను మనసా, వాచా, కర్మణా ప్రేమించిన పూర్ణత్వం ఆయనది. భార్య పట్ల భర్త కృతజ్ఞత ఉండాల్సిన గొప్ప సంస్కృతిని ప్రతిష్ఠింపజేసిన మహోన్నతుడు ఆయనే. సాహితీ, సాంస్కృతిక గాన పిపాసి, పుస్తక తాపసి వర ప్రసాద్‌రెడ్డి. భార్యకు ఆయన చూపే కృతజ్ఞత వెనుక అంతస్సూత్రం విలువైన సమాజాన్ని స్వప్నించడమే. వైవాహిక బంధాన్ని సంస్కరించి సమున్నత స్థితికి తీసుకొచ్చే భగీరథ ప్రయత్నమే వరప్రసాదరెడ్డి ఆవిష్కరిస్తున్నది.

సతీమణి జీవనజ్యోతిగా మమకారం, ఆమె మంత్రిత్వ సహకారం పట్ల లాలస, ఆమె హృదయవైశాల్యానికి జేజేలు చెప్తూ 'ధర్మపత్నీ సమేతస్య' శత వసంత సుపథంలో అనే గొప్ప గ్రంథాన్ని ఆమెకు కానుకగా వెలువరించారు. వసంత రాగం ఆలపించారు. ఇది అందరికీ ఆచరణయోగ్యమైన విశిష్ట కార్యక్రమం కావడం అతిపెద్ద విశేషం.

*నీతో కలిసి నీడగ నడిచే*
*తోడుగ నేనున్నాను*
*నీ తోడుగ నేనున్నాను*

అని తోడు నీడగ నడిచే వసంత 'సహన చంద్రికల' సెల యేరుగా అభివర్ణించారాయన. వారిద్దరి ఒద్దికను కూర్చి చెబుతూ ఆ ఒద్దిక ఎంతలా అంటే – ఒద్దికకు నోరొచ్చి 'ఒద్దు – ఇక' అని చెప్పడం గొప్ప మధుర భావన.

వసంత ప్రేమైక జీవన స్వాప్నిక. అలసిన సొలసిన మనసులో వసంత గానాన్ని నింపి వెన్నెల పరవశాన్ని అందించిన మహా ఇల్లాలు. దాంపత్యానికి పునాది పరస్పర నమ్మకం మాత్రమే కాదు, ఒకరికొకరు మద్దతు కావడం ముఖ్యమనే సంప్రదాయం వెల్లివిరిస్తే సంసారాలు వెలుగుబాటన పయనిస్తాయి. ఒక సంబంధం సుధృడంగా ఉండాలంటే భావోద్వేగ అనుబంధం అవసరం అంటారాయన. ఇది ముమ్మాటికీ నిజం.

కాలం విరచించిన వివాహ విజయోత్సవ గాధయే 'ధర్మపత్నీ సమేతస్య' పుస్తకం. మన మస్తకాలకు పదునుపెడ్తుంది. ఇది వసంత రాగాల్ని ఆలపిస్తుంది. తెగిన హృదయవీణలను అతికిస్తుంది. ఒడిదుడుకుల వైవాహిక బంధాల్ని కలిపే వైతావళిక గీతం ఈ పుస్తకం సమస్తం. ఇదో కొత్త ఒరవడికి నాంది అవుతుంది. భార్య అనురాగానికి చిహ్నంగా పుస్తకం వెలువరించే ఈ సరికొత్త సంప్రదాయం అభిలషణీయం.. సంచలనం కూడా!

సంచలనమేమీ వరప్రసాదరెడ్డికి కొత్త కాదు. హెపటైటిస్–బి వ్యాక్సిన్లను భారత దేశానికి అతితక్కువ ధరల్లో అందుబాటులోకి తెచ్చిన మహనీయుడాయన. ఆయనెప్పుడూ సంచలనాల సారథే!

నిజానికి ప్రతిబిడ్డా మాతృమూర్తి సొత్తే అవుతుంది. జన్మనిచ్చేది అమ్మ కాబట్టి! తండ్రిని గౌరవించడం సంస్కారమే. అమ్మ తర్వాత భార్యే అమ్మవుతుంది. అందుకే ఇద్దరు స్త్రీమూర్తులలోనూ అమ్మను దర్శించిన అమృతహృదయుడు వరప్రసాదరెడ్డి కారణజన్ముడు.

వసంత తుఫాన్లను ముందే పసిగట్టిన ఆకాశం అంటారు ఆతిథ్య మర్యాదలకు మానవీయ సంబంధాలు అద్దిన సౌశీల్యం ఆమెదని మురిసిపోతారు. ఇపుడీ 70లలో తానే తల్లిగా మారి, భర్తనే నవజాత శిశువుగా పొదవి మృదువైన స్నేహమధురిమను అందించే మనోజ్ఞ హృదయను తన సతీమణిలో దర్శిస్తూ, ఆమె జీవితంలో తనది అరుదైన అందమైన అపురూప ప్రయాణంగా భాసిస్తున్నదంటారు వరప్రసాదరెడ్డి.

ఓ నెల్లూరు పల్లెటూరిపిల్ల వసంత. వరప్రసాదరెడ్డిని గొప్ప వ్యక్తిగా తీర్చిదిద్ది పద్మభూషణ్‌ను చేయడమేకాకుండా, డాక్టర్‌ను చేసి జీవిత కథానాయకుడిగా మలచిన తీరు అద్వితీయం. ఆ స్త్రీమూర్తి వసంత మహిళల పాలిట ఆదర్శం. ఆమె బాటలో మహిళలందరూ నడవాల్సిన అవశ్యం ఉత్తమ సామాజిక లక్షణం, లక్ష్యం కావాలి. ఆమె ఒక స్నేహపూర్వక స్పర్శతో నమ్మకం పెంచేది, ఒకే ఒక చిరునవ్వుతో ధైర్యాన్నిచ్చేది అని ప్రశంసిస్తారు వరప్రసాద రెడ్డి. ప్రభుత్వోద్యోగాన్ని వదలి వ్యాపార రంగ ప్రవేశంలో ఆమె గణనీయమైన పాత్రను లెక్కించి, విస్తరణలో సామ్రాజ్ఞిగా నిలచిన ధీరవనిత వసంత.

వసంత హౌస్‌వైఫ్ కాదు హౌస్ ఇంజనీర్ అంటూ అందుకు ఆమె వాడే సిమెంటు, సెంటిమెంటు అని చమత్కరిస్తారు. ఆమె త్యాగం ఓ నిర్ణిద్ర మహాయోగంగానూ, ఆమె వాక్యం ఓ నిశ్శబ్ద మహాకావ్యంగానూ మలచిన విజ్ఞత కూడా ఆయనదే. వసంత నవ్వు వెనుక ఎన్నెన్నో త్యాగాల గాధలు, ప్రతి ఉదయం కుటుంబం కోసం సరికొత్తగా పుడుతుందంటారు ఆ వేడుకను తలచుకుంటూ. ఆమె పాదాల క్రింద ముళ్ళు ఉన్నా చిరునవ్వులు చిందించే నిత్యవసంతంగా మురిసిపోతారు.

అలాంటి మహాసాధ్వికి, లలామవసంతకు కృతజ్ఞతలు చెప్పే సంస్కారశీలి, కృతజ్ఞతాభివందనాల సమర్పణే ఈ పుస్తకం అని వినమ్రంగా శెలవిస్తారు వరప్రసాదరెడ్డి.

'నీ సుఖమే నే కోరుతున్నా' అని ఓ కవి అన్నట్లుగా 'నీవు ప్రేమించిన వాళ్ళు దక్కాలనుకోవడం కంటే వారు సుఖసంతోషాలతో ఉండాలనుకోవటంలోనే ఆనందం ఉందనుకునే వసంత, ఆ కృతజ్ఞతే దైవీభారంగా చరమాంకం వరకు అత్తగారిపై ఉండటాన్ని గుర్తుచేసుకుంటూ సంతోషిస్తారాయన.

పురుషునిలో సగం భార్య, ఆమె అందరికీ మించిన స్నేహితురాలు. పురుషార్థాలలో ధర్మ, అర్థ, కామాలకు ధర్మపత్నియే మూలం అంటూ చివరిదైన మోక్షానికి కూడా ఆమేనని అన్నారందుకే అని ఘంటాపదంగా చెప్తూ, బాధని బాధ్యతగా స్వీకరించ గలిగిన సడలిపోని వ్యక్తిత్వం వసంతదని చెప్తారు.

అందుకేనేమో ఆమెకు 'వందనాలు సిరిచందనాలు' అర్పిస్తారు వరప్రసాదరెడ్డి. తన వసంత 'జ్యోతిర్మణిమయ కాంతులీను ప్రియ వసంతకాంత'గా చెప్పడం, ఆమెకు మాతృవందనం చేయడం వసంత రాగానికి నిలువెత్తు ప్రామాణికం కాగలదు.



సమీక్ష:
'కళారత్న' చిన్ని నారాయణరావు
94402 02942

J/NELLORE/003/24-26 R.N.I.No.25359/74 పేజీలు : 12

THE BEST TELUGU WEEKLY OF NELLOREANS

# లాయర్

సంపుటి : 46 సంచిక : 1 5.6.2026, శుక్రవారం వెల : రూ. 10 /-

వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంపాదకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి

## లాయర్ @ 45

### 45 ఏళ్ళుగా..

# మా బలగమే.. మా బలం!

నేటికి సరిగ్గా 45ఏళ్లు. 1981 జూన్ 5వతేదీన సీనియర్ పాత్రికేయులు, కీర్తిశేషులు తుంగా రాజగోపాలరెడ్డి గారు నెల్లూరుజిల్లా స్థానిక పత్రికా ప్రపంచంలో వెలిగించిన లాయర్ అనే చిరు దీపానికి నేటితో నాలుగున్నర దశాబ్దాలు పూర్తి. ఆ చిరు దీపం ఇప్పుడు అఖండ అక్షరజ్యోతిగా మారి సమాచార రంగంలో ప్రకాశిస్తోంది. నిష్పక్షపాత వార్తలతో వారం వారం అక్షర సమరాన్ని కొనసాగిస్తోంది. ఓ స్థానిక వారపత్రికగా పుట్టి, ఎన్నో కష్ట నష్టాలను, ఆర్థిక ఒడిదుడుకులను, రాజకీయ ఒత్తిళ్లను భరిస్తూ... ఈనాటికి మన లాయర్ నిర్భయంగా ముందుకి సాగుతోందంటే అందుకు కారణం... ప్రతి వారం లాయర్ పత్రిక కోసం ఎదురుచూసే పాఠకుడి నమ్మకమే. ఆ నమ్మకమే మన లాయర్‌కి ఆక్సిజన్ వంటిది. చిన్న, పెద్ద వ్యాపారస్తులతో పాటు కార్పొరేట్ కంపెనీలు, విద్యాసంస్థలు, వైద్యాలయాలు అనేక రంగాల ప్రముఖులు తమ ప్రకటనల కోసం లాయర్‌ని వేదిక చేసుకుంటున్నారంటే అది లాయర్ పై వారికున్న అచంచల విశ్వాసానికి నిదర్శనం. లాయర్ వేసే ప్రతి అడుగులో తమ పథం కలుపుతూ మీకు తోడుగా మేమున్నాం అంటూ భుజం తట్టి ప్రోత్సహిస్తున్న మన లాయర్ హితులకి, సన్నిహితులకి, శ్రేయోభిలాషులకి లాయర్ ఎప్పుడూ రుణపడి ఉంటుంది.

**సిరా నుంచి స్క్రీన్ వరకూ మారిన సాంకేతికత...**

గడచిన 45 ఏళ్లలో సంచలనాత్మకంగా జర్నలిజం రూపం మారింది. 1980 దశకంలో చేతితో కంపోజింగ్, ట్రెడిల్ - సిలిండర్ లాంటి మిషన్లపైన పత్రికని ముద్రించిన రోజులు మా మధుర జ్ఞాపకాలు. నేడు డిజిటల్ డెస్క్, ఆన్‌లైన్ ఎడిషన్, వాట్సాప్ గ్రూపులు మా ప్రధాన వేదికలు. ప్రింట్ ఎడిషన్‌తో పాటు మా వెబ్‌సైట్, సోషల్ మీడియా పేజీల ద్వారా క్షణాల్లో వార్త మీ దగ్గరకు చేరుతోంది. వేగం పెరిగింది, పరిధి కూడా విస్తరించింది. రెప్పపాటు కాలంలో ప్రపంచవ్యాప్తంగా వున్న లక్షలాదిమంది నెల్లూరీయుల ల్యాప్‌టాపులలో, సెల్‌ఫోన్‌లలో ప్రతీ గురువారం లాయర్ ప్రత్యక్షమవుతుంది.

టెక్నాలజీ మారింది. వేగం పెరిగింది. కానీ, మా మూలసిద్ధాంతం మారలేదు. వాస్తవాలను వక్రీకరించకుండా, ప్రజా సమస్యలను ధైర్యంగా లేవనెత్తడం, అధికారాన్ని ప్రశ్నించడం, స్థానిక సంస్కృతిని పరిరక్షించడం - ఇవే మా 45 ఏళ్ల ఆస్తి. జాతీయ ఛానళ్ళు, పెద్ద పెద్ద దినపత్రికలు, వందల కొద్దీ యు ట్యూబ్ ఛానళ్ళు వంటివి ఎన్ని వచ్చినా మా ప్రాధాన్యత మారలేదు. మీ వార్డు సమస్య, మీ కాలనీ సమస్య, మీ రోడ్డు సమస్య, మీ ఇంటి వేడుక, స్థానిక రాజకీయాల విశ్లేషణ ఇవే మాకు ప్రధాన వార్తలు. ప్రాంతీయమే కొత్త జాతీయం (లోకల్ ఈజ్ ద న్యూ నేషనల్) అనే సూత్రాన్ని మేము 45 ఏళ్ల క్రితమే నమ్మాము. అందుకే ఇన్నాళ్ళుగా, ఇన్నేళ్ళుగా ఎక్కడా మాకు జనాదరణ తగ్గలేదు. పాఠకులలో, ప్రకటనకర్తలలో మాపై విశ్వాసం సడలలేదు. 45 ఏళ్ళు పూర్తి చేసుకోవడం ఓ మైలురాయి మాత్రమే. మీరిచ్చే ఉత్సాహంతో మీరందించే ప్రోత్సాహంతో స్వర్ణోత్సవం వైపు అడుగులు వేస్తున్నాం.

మీ వెంట మేమున్నాం అంటూ ఎప్పటికప్పుడు మీరందిస్తున్న కొండంత భరోసాతో అక్షర సేవలో పునరంకితమవుతున్నాం. మా పాఠకులే మా బలగం, మా ప్రకటనకర్తలే మా బలగం, మా శ్రేయోభిలాషులే మా బలగం... అందుకే అంటున్నాం "మా బలగమే మా బలం".

ఈ 45వ వార్షికోత్సవ శుభవేళ లాయర్ పాఠకులకు, ప్రకటనకర్తలకు, నిత్యం ప్రోత్సహిస్తున్న లాయర్ హితులకి, సన్నిహితులకి... *శతకోటి కృతజ్ఞతాభివందనాలు...!*

తుంగా శివప్రభాత్‌రెడ్డి (ప్రభు)

# జగన్ తొందరపడుతున్నాడా?

## పదవిపై ఆరాటం.. అర్థంలేని పోరాటం

14లో

- హత్యా రాజకీయాల చుట్టూ ఆంధ్రా పాలిటిక్స్
- ఫ్యాక్షన్ ప్రస్తావన తెచ్చి.. జగన్ స్వయంకృతాపరాధం
- తాత, తండ్రి, బాబాయ్‌ల మృతి మాటలపై సర్వత్రా విమర్శలు
- నేటి తరానికి గతం గుర్తుచేసే క్రమంలో సెల్ఫ్‌గోల్

# బాలూ స్మారకం.. చెరిగిపోని జ్ఞాపకం!

నెల్లూరులో గానగంధర్వుని విగ్రహావిష్కరణ

8, 9పేజీల్లో...






కీ॥శే॥ తుంగా రాజగోపాలరెడ్డి గారు
వ్యవస్థాపకులు, 'లాయర్' వార్తాపత్రిక

45 ఏళ్ళ లాయర్ ప్రస్థానం
అపూర్వం.. అనితరసాధ్యం!
స్థానిక పత్రికల చరిత్రలోనే
అద్భుతం!.. చరిత్రాత్మకం!

లాయర్
వార్తాపత్రికకు
45వ వార్షికోత్సవ శుభాకాంక్షలు.

లాయర్ 45 YEARS



వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి
నెల్లూరు లోక్‌సభ సభ్యులు
చైర్మెన్, విపిఆర్ గ్రూప్

వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి
కోవూరు శాసనసభ్యురాలు
టిటిడి పాలక మండలి సభ్యురాలు

లాయర్
జూన్ 05, 2026

# సాగరాలు.. కాలుష్య కాసారాలు కాకూడదు!

మహా సముద్రాలు మనకు ప్రకృతిమాత ప్రసాదించిన మహా గొప్ప వరాలు. భూమి ఉపరితలం మీద సుమారు 70 శాతానికి పైగానే ఆవరించి ఉన్న సముద్రాలు, ప్రపంచ మానవాళికి ఎన్నో ప్రయోజనాలు చేకూర్చుతున్నాయి. ముఖ్యంగా మనం పీల్చే ఆక్సిజన్ (ప్రాణవాయువు)లో సగానికి పైగానే లభించేది ఆ మహా సాగరాల నుంచేనని మనం గుర్తుంచుకోవాలి. వాతావరణంలోని కార్బన్‌డైఆక్సైడ్‌ని ఎక్కువగా గ్రహించి, వాతావరణ సమతుల్యాన్ని కాపాడేది సముద్రాలేనని శాస్త్రవేత్తలు చెప్తూనే ఉన్నారు. అందుకే, మనకు ప్రాణభిక్ష పెట్టే సముద్రాలని మనం పరిరక్షించుకోవాలే గానీ, చేజేతులా నాశనం చేసుకోకూడదు. అయితే, దురదృష్టం.. ఎంతో స్వచ్ఛమైన సాగరాలు ఎన్నో రకాల కాలుష్యాలతో, రకరకాల చెత్తాచెదారంతో, అంతులేని ప్లాస్టిక్ వ్యర్థాలతో నిండిపోయి, భయంకరంగా తయారవుతున్నాయి. వాటన్నిటికీ మూలం మానవ నిర్లక్ష్యమే. అపారమైన మత్స్యసంపద, జలసంపదకు ఆవాసమైన సముద్రాలను మనమే కాలుష్య మయం చేస్తున్నాం. టన్నులకొద్దీ చెత్తని, వందల ఏళ్ళు తరిగిపోయినా కరిగిపోని ప్లాస్టిక్ వ్యర్థాలని కుప్పలు తెప్పలుగా, గుట్టలు గుట్టలుగా సముద్రాల్లో కలిపేస్తున్నాం. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న సముద్రాలన్నీ గత కొద్దికాలంగా ఇలాంటి దుస్థితినే ఎదుర్కొంటున్నాయి. ఆ వ్యర్థాలన్నీ పేరుకునిపోయి చివరికి మానవుడికి అదే ఒక పెద్ద సవాలుగా, భవిష్యత్ తరాలకి పెద్ద ముప్పుగా పరిణమించనుంది. సముద్ర తీరప్రాంతాల్లో కోటానుకోట్లమంది మత్స్యకారులు, ప్రజలు జీవనం సాగిస్తున్నారు. ఆయాప్రాంతాల్లోని సముద్రాలలో ఉన్న జలసంపదపై పెత్తనం చేస్తూ అనేకదేశాల్లో ఎంతోమంది అలవిగాని వ్యాపార సామ్రాజ్యాలు నిర్మించుకుంటున్నారు. చేపలు పట్టుకుని జీవించే సామాన్య జాలర్ల మొదలు, సముద్ర ఉత్పత్తుల మీద ఆధారపడి జీవించే జనానికంతా అన్నం పెట్టేది సముద్రాలే. అంతేకాదు, ఎంతో కనువిందు చేసే బీచ్‌లు, సాగరతీరాలు మనకున్నాయి. పర్యాటకరంగానికి జవం జీవం అంతా సముద్రాలు.. వాటి తీరాలే. అనునిత్యం లక్షలు.. కోట్లాదిమంది సాగరతీరాల్లో విడిదిచేసి విహారాలు చేస్తుంటారు. కనువిందైన సాగరతీరాల్లో ఆహ్లాదంగా గడుపుతుంటారు. కానీ, వారు తిని పారేసిన వ్యర్థాలన్నీ సముద్రజలాల్లోనే కలసిపోతున్నాయి. ఆ చెత్తాచెదారాన్ని ఎప్పటికప్పుడు తొలగించేందుకు ప్రభుత్వాలు కానీ, అక్కడున్న ప్రజలు కానీ పట్టించుకోకపోవడంతో సాగరాలు కాలుష్యభూయిష్టంగా మారుతూనే ఉన్నాయి. ఫ్యాక్టరీల నుంచి, పొలాల నుంచి వచ్చే విషతుల్యమైన రసాయనాలు, ఎంతో హానికరమైన వ్యర్థాలన్నీ కూడా చివరికి సముద్రాల్లోకే చేరిపోతున్నాయి. సముద్ర జలాల పైనా, లోపలా కూడా అంతా కాలుష్యమే నిండిపోతోంది. పర్యావరణానికి ప్రమాదం కలిగించే ప్లాస్టిక్ వ్యర్థాలను పూర్తిస్థాయిలో నిరోధించడంలో మనదేశంతో సహా అనేక దేశాలు వెనుకబడే ఉన్నాయి. ప్రతినిత్యం కాలువలు, నదుల్లోంచి వచ్చే కాలుష్యం ప్రవాహాలుగా తరలివచ్చి సముద్రాల్లోనే కలసిపోతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. ఫలితంగా, సముద్ర కాలుష్యం ఏర్పడి అనంతమైన మత్స్యసంపద, సముద్ర జీవులు క్రమేణా అంతరించిపోయే దుర్దశకి చేరుకుంటున్నాయి. ఈ కాలుష్యం కారణంగా ప్రజల ఆరోగ్యం కూడా దెబ్బతింటోంది. ఈ నేపథ్యంలో సముద్ర రక్షణ గురించి ప్రజల్లో అవగాహన కల్పించి, వాటి పరిరక్షణ కోసం మానవాళిని చైతన్యవంతం చేయడం కోసం 1992లో బ్రెజిల్‌లోని రియో-డి-జనీరో’లో ప్రపంచ ధరిత్రి సదస్సు జరిగింది. ఆ తర్వాత ఐక్యరాజ్య సమితి కూడా రంగంలోకి దిగి, ప్రతిఒక్కరూ నిర్దిష్టమైన కార్యాచరణతో సముద్ర తీరాలను పరిశుభ్రం చేసుకోవాలని, సాగరాలను కాలుష్యానికి గురికాకుండా రక్షించుకోవాలని నిర్ణయించి, 2008 నుంచి ప్రతి ఏటా జూన్ 8న ‘ప్రపంచ మహాసముద్రాల దినోత్సవం’ నిర్వహించుకోవాలని పిలుపునిచ్చింది. ఈ ఏడాది ‘మన నీలిగ్రహం కోసం సముద్ర సంరక్షిత ప్రాంతాలను పటిష్టం చేసుకోవాలని’ సూచించింది. అందుకు ప్రతిఒక్కరూ సహకరించి, మన సముద్రాలని కాలుష్య కాసారాలు కాకుండా చూసుకోవాలి. సముద్ర తీరాల్లోని చెత్తాచెదారాన్ని ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకుంటూ, సముద్రాల్లో కాలుష్యం కలవకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలి. ప్రభుత్వాలు నిర్లక్ష్యం వీడి, ప్రజల మనుగడకు నష్టం వాటిల్లకుండా, పర్యావరణానికి ప్రాణప్రదంగా ఉండేలా సముద్రాలను స్వచ్ఛంగా ఉంచుకునేలా గట్టి చర్యలు తీసుకోవాలి. అన్ని దేశాలు, అన్ని ప్రాంతాల్లోని ప్రజలు సముద్రాల రక్షణకు నడుం బిగించాల్సివుంది. ముఖ్యంగా తీరప్రాంతాల వారు ‘రండి-మన సముద్రాలని మనం కాపాడుకుందాం’ అంటూ, అందుకు ముందడుగు వేయాల్సి ఉంది.

**(జూన్ 8 - ప్రపంచ మహాసముద్రాల దినోత్సవం)**

ఈ-మెయిల్
ప్రజావాణి
lawyerpatrika@gmail.com
+91 98663 14741

## నెల్లూరులో మన బాలు విగ్రహం సంతోషదాయకం!

భారతీయుల గుండెల్లో, ముఖ్యంగా తెలుగువారి హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయిన గానగంధర్వులు, మహా గాయకులు పద్మవిభూషణ్ డా. ఎస్పీ బాల సుబ్రహ్మణ్యం గారు. ఆయన విగ్రహాన్ని వారి స్వస్థలమైన నెల్లూరు నగరంలో ఏర్పాటు చేస్తుండడం అత్యంత సంతోషదాయకం. ఈ శుభవార్త తెలిసిన ప్రతి సంగీతప్రియుని, ప్రతి నెల్లూరువాసి హృదయం ఉప్పొంగిపోతుంది. నెల్లూరు మట్టిలో పుట్టి, తన గళంతో ప్రపంచ వ్యాప్తంగా విస్తరించిన ప్రతి తెలుగువారి ఇళ్లల్లో తన గాత్రంతో కొలువైన బాలు గారు మనందరి ఆస్తి. 16 భాషల్లో 40 వేలకు పైగా పాటలపాడారు. అనేక జాతీయ, అంతర్జాతీయ అవార్డులు, సత్కారాలు, పురస్కారాలు అందుకున్నారు. ఇవన్నీ కేవలం సంఖ్యలు కాదు. కోట్లాదిమంది జీవితాల్లో ఆయన నింపిన భావోద్వేగాలు, జ్ఞాపకాలు. ఆయన విగ్రహం నెల్లూరులో ఏర్పాటు చేయడం ద్వారా భావితరాలకు స్ఫూర్తినిచ్చే గొప్ప సాంస్కృతిక చిహ్నం మనకు దక్కుతోంది. ఈ విగ్రహం కేవలం ఓ కళాకారుడి స్మారకం మాత్రమే కాదు. ఇది నెల్లూరుకు దక్కిన అతిగొప్ప గౌరవం. నిత్యం ఆయన పాటలు వింటూ తరిస్తున్న ప్రతి ఒక్కరికీ ఇది ఒక పుణ్యక్షేత్రంలా స్ఫురిస్తుంది. ఈ మహత్తర కార్యానికి చొరవచూపిన వెంకయ్యనాయుడు గారికి, మంత్రివర్యులకు, స్థానిక ప్రజాప్రతినిధులకు, కార్యక్రమాన్ని తన భుజస్కంధాల పైకి ఎత్తుకుని నిర్వహిస్తున్న ‘లాయర్’ ప్రభు గారికీ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను. దీనిని కేవలం ఒక విగ్రహంలా కాకుండా ఒక స్మారకంలా రూపకల్పన చేస్తుండడం అభినందనీయం. 32వేల కీర్తనలు రచించి ఆలపించిన శ్రీమాన్ తాళ్ళపాక అన్నమాచార్యుల వారి విగ్రహానికి ఎదురుగా మన బాలుని నిలబెట్టడం మహాద్భుతం. గళం ఆగినా, గానం ఆగదు. బాలు గారు భౌతికంగా మన మధ్య లేకపోయినా, ఆయన పాట రూపంలో, ఇకపై విగ్రహం రూపంలో కూడా మనతోనే ఉంటారు.

**లక్ష్మీభరద్వాజ్, హైదరాబాదు.**

## పెట్రోల్, డీజిల్ ధరలు భారం... సామాన్యుడి బ్రతుకు ఘోరం!

రోజురోజుకూ పెరిగి తగ్గుతున్న పెట్రోల్, డీజిల్ ధరలు సామాన్య, మధ్యతరగతి ప్రజల జీవితాలతో దోబూచులాడుతున్నాయి. సామాన్యుల జేబులకు చిల్లు పెడుతున్నాయి. ఉదయం లేచేసరికి ఒక రేటు, సాయంత్రానికి మరో రేటు ఉంటున్నాయి. ఈ అస్థిరత వల్ల బడ్జెట్ వేసుకోవడం కష్టంగా మారింది. ముడిచమురు ధర బ్యారెల్ రేటు 70నుంచి 90డాలర్ల మధ్య ఊగిసలాడుతోంది. యుద్ధాలు నేరుగా మనపై ప్రభావం చూపుతున్నాయి. డాలర్‌తో పోలిస్తే రూపాయి దారుణంగా బలహీనపడి, దిగుమతి ఖర్చు పెరిగి పెట్రోల్ ధర పెరుగుతోంది. కేంద్ర ఎక్సైజ్ సుంకం, రాష్ట్ర వ్యాట్ కలిపితే లీటర్ ధరలో 50శాతానికి పైగా పన్నులే. ధర తగ్గినా పన్నుల భారం వల్ల వినియోగదారుడికి ఊరట లభించడం లేదు. ఈ కారణంగా రవాణా ఖర్చులు పెరిగి కూరగాయల నుంచి నిత్యావసరాల వరకు అన్నింటి ధరలు ఆకాశాన్ని తాకుతున్నాయి. పెట్రోల్‌ని డీజిల్‌ని జీఎస్టీ పరిధిలోకి తెస్తే దేశవ్యాప్తంగా ఒకే ధర కలిగి, పన్ను భారం తగ్గే అవకాశం ఉంది. ప్రజారవాణా, ఎలక్ట్రిక్ వాహనాలను ప్రోత్సహించాలి. ప్రభుత్వాలు ధరల స్థిరీకరణ నిధిని ఏర్పాటు చేసి ఆకస్మిక పెరుగుదలను నియంత్రించాలి. ప్రస్తుతం సామాన్యుడి బతుకుబండి చమురు ధరల చుట్టూ తిరుగుతోంది. ఈ అనిశ్చితికి శాశ్వత పరిష్కారం చూపే దిశగా ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలి.

**- ఆర్.పి.రామయ్య, కొండాయపాలెం, నెల్లూరు.**

# స్మార్ట్ హోమ్స్‌లో బందీలుగా...

మనసులో మాట 100

మనం ఒక విచిత్రమైన యుగంలో జీవిస్తున్నాం. సాంకేతికత పెరిగి ఇళ్లు ‘స్మార్ట్’ అవుతున్నాయి కానీ, ఆ ఇళ్లలోని మనుషుల మనసులు మాత్రం సంకుచితమైపోతున్నాయి. ఒకప్పుడు ఇల్లు అంటే నాలుగు గోడల మధ్య ముడిపడిన ఆత్మీయ బంధాల సమాహారం. నేడు ఇల్లు అంటే ఒకే వై-ఫై (Wi-Fi) నెట్‌వర్క్‌కు అనుసంధానమై, విడివిడి గదుల్లో బందీలైన ఐసోలేషన్ వార్డుల కలయిక. భూతాపం, అంతర్జాతీయ సంక్షోభాలు దేశ ఆర్థిక వ్యవస్థను శాసిస్తున్న తరుణంలో, మన కంటికి కనిపించకుండా, ఎటువంటి యుద్ధ ప్రకటనా లేకుండా మన కుటుంబ వ్యవస్థను రూపుమాపుతున్న ‘డిజిటల్ దురాక్రమణ’ గురించి అందరూ చర్చించుకుని దాని నుంచి బయట పడాల్సిన సమయం వచ్చింది. మన కళ్ల ముందే, ఒకే అపార్ట్‌మెంట్ గూటిలో నిశ్శబ్దంగా ముక్కలైపోతున్న మూడు తరాల జీవన చిత్రాన్ని పరిశీలిద్దాం.

### ఒకే గూడు.. మూడు విభిన్న లోకాలు

నేటి ఆధునిక స్మార్ట్ హోమ్‌లోకి అడుగుపెడితే మూడు తరాల ప్రతినిధులు కనిపిస్తారు. మొదటి తరం-మనల్ని పెంచి పెద్ద చేసిన అమ్మమ్మ-తాతయ్య లేదా నాయనమ్మ-తాతయ్యలు. రెండో తరం-సమాజపు ఉరుకుపరుగుల రేసులో నలిగిపోతున్న నేటి ఉద్యోగస్థులైన తల్లిదండ్రులు. మూడో తరం-భవిష్యత్తు వైపు అడుగులు వేస్తున్న పట్టుమని పదేళ్లు కూడా లేని చిన్న పిల్లలు. భారతీయ సంస్కృతిలో ఈ మూడు తరాల కలయిక ఒక అద్భుతమైన నందనవనం. కానీ నేటి డిజిటల్ యుగంలో ఆ వనం కాస్తా ఏకాకి దీవుల సముదాయంగా మారిపోయింది.

**మొదటి తరం :** ఒకప్పుడు వంటింట్లో వచ్చే తిరగమాత వాసన ఇళ్లను సజీవంగా ఉంచేవి. అందరికీ వడ్డించాక అందరి కళ్లల్లోని తృప్తిని చూసి మురిసిపోయే అమ్మ ముఖం-కుటుంబానికి అవసరమైన ‘భావోద్వేగ ఇంధనం’. కానీ నేడు వంటగది ఒక నిర్జీవమైన గది. ఆకలి వేస్తే చాలు, యాప్‌లలో ఆర్డర్ ఇస్తాం. అరగంటలో ప్లాస్టిక్ డబ్బాల్లో నింపిన ఆహారం మన ఇంట్లోకి ప్రవేశిస్తోంది. బెడ్‌రూమ్‌లో ఒకరు, హాల్లో ఒకరు ఎవరి ప్లాస్టిక్ డబ్బా పట్టుకుని వారు నిశ్శబ్దంగా తింటున్నారు. మిస్ అవుతున్నది రుచి కాదు, ఆత్మీయత.

**రెండో తరం :** వంటగది నుంచి హాల్‌లోకి వస్తే, అక్కడ మరో నిశ్శబ్ద రోదన వినిపిస్తుంది. మన తాతయ్యలు, అమ్మమ్మలు కేవలం వయసు పైబడిన ముసలి వాళ్లు కాదు; ఒక తరం అనుభవాల సారం, సంస్కృతిని తరువాతి తరానికి అందించే ‘నడిచే గ్రంథాలయాలు’. కానీ నేడు వారిని కేవలం ‘ఒక గదికే’ పరిమితం చేశాం. ఒకే ఇంట్లో కథలు చెప్పాలని, అనుభవాలు వివరించి జీవిత పాఠాలు నేర్పించాలని తపించే పెద్ద ఒకడు ఉన్నాడు. ఇంటిని ఎలా చక్కపెట్టుకోవాలో అనుభవపూర్వకంగా వివరించాలనుకునే ఒక పెద్దావిడ సిద్ధంగా ఉంది. కానీ వినడానికి ఎవరు సిద్ధంగా లేరు. వారికి - మనవడు మనవరాళ్ళకి మధ్య ‘స్మార్ట్‌ఫోన్’ అనే ఒక అదృశ్య గోడ ఉంది. పిల్లవాడు తనకు అవసరమైన వినోదం కోసం గూగుల్‌ను అడుగుతున్నాడు తప్ప, పక్కనే ఉన్న తాతయ్యను పలకరించడం లేదు. ఒక తరం మేధస్సు ఏ వారసుడికీ అందకుండానే నిశ్శబ్దంగా మట్టిలో కలిసిపోతోంది.

**మూడో తరం :** ఇక చిన్న పిల్లలు, యువత ఇటు అమ్మ చేతి ముద్దను, అటు తాతయ్య కథలను వదిలేసి ఫోన్ స్క్రీన్ల వెనుక కృత్రిమ బతుకులు బతుకుతున్నారు. కృత్రిమ నవ్వులతో ఇన్‌స్టాగ్రామ్ రీల్స్ చేస్తున్న ఈ తరం వెనుక విపరీతమైన ఒంటరితనం, డిప్రెషన్ దాగున్నాయి. స్క్రీన్ మీద వందల లైకులు వస్తేనే తమ సంతోషాన్ని నిర్ణయించుకునే ఒక మానసిక బానిసత్వంలోకి చిన్నారి బాల్యం వెళ్ళిపోతోంది. కెమెరా ముందు బ్రతకడం అలవాటైన వీరికి, నిజమైన జీవితాన్ని తట్టుకునే మానసిక శక్తి కరువవుతోంది.

### ఐక్యరాజ్యసమితి పిలుపు.. మన బాధ్యత

ఇటీవలే (జూన్ 1న) ముగిసిన ‘ప్రపంచ తల్లిదండ్రుల దినోత్సవం’ (Global Day of Parents) సందర్భంగా ఐక్యరాజ్యసమితి ఒక ఉన్నతమైన సందేశాన్ని ప్రపంచానికి ఇచ్చింది. “ప్రపంచవ్యాప్తంగా ఉన్న తల్లిదండ్రులందరినీ అభినందించడం మరియు గౌరవించడం”. అయితే, ఈ గౌరవం కేవలం ఏడాదికి ఒకరోజు సోషల్ మీడియాలో పెట్టే ‘హ్యాపీ పేరెంట్స్ డే’ స్టేటస్‌లకో, అభినందనలకో పరిమితం కాకూడదు. కన్నవారిని గౌరవించడం అంటే మనతో పాటు ఒకే ఇంట్లో ఉంటున్న మన వృద్ధ తల్లిదండ్రులకు ఒంటరితనాన్ని దూరం చేయడం. మన పిల్లల ముందే మనం మన తల్లిదండ్రులను గౌరవిస్తూ, వారికి మన జీవితంలో ఉన్న ప్రాముఖ్యతను తెలియజేయాలి. తాతయ్యల అనుభవాల విలువను పిల్లలకు చిన్నతనం నుంచే పరిచయం చేస్తూ, వారి మధ్య అనుబంధాన్ని పెంచేలా చేయాలి. ఎందుకంటే, పిల్లలు మనం చెప్పే మాటల కంటే, మనం చేసే పనులనే ఎక్కువగా గమనిస్తారు, అనుకరిస్తారు. మనం పిల్లల భవిష్యత్తు కోసం ఆస్తులు కూడబెడుతున్నాం, కార్లలో తిరుగుతున్నాం, ఇళ్లను విలాసంగా మారుస్తున్నాం. కానీ, వారికి ఇవ్వాల్సిన అత్యంత విలువైన మన ‘సమయాన్ని’, మన ‘సంస్కృతిని’ మాత్రం ఇవ్వలేకపోతున్నాం. గ్యాడ్జెట్ల రూపంలో మనం వారి చేతిలో పెట్టేది సాంకేతికత కాదు, వారి సహజత్వాన్ని మింగేసే ఒక మాయాజాలం. డిజిటల్ దురాక్రమణ వల్ల చేజారిన బాల్యాన్ని, విచ్ఛిన్నమైన బంధాలను తిరిగి పొందలేము. పిల్లలకు ఫోన్ ఇచ్చేముందు, లేదా తల్లిదండ్రులను గదికే పరిమితం చేసే ముందు మనమందరం ఒక్క నిమిషం ఆలోచించాలి... మనం ఒక అద్భుతమైన తరాన్ని నిర్మిస్తున్నామా, లేక మన ఇంట్లోనే జైళ్లను తయారు చేసుకుంటున్నామా అన్న ప్రశ్న వేసుకుంటే పరిష్కారం కచ్చితంగా దొరుకుతుంది.




**- తుమ్మల బాల గంగాధర్ తిలక్**



# ప్రతిభామూర్తులకు.. 9న 'పట్టా'భిషేకం

## • కెఐ వరప్రసాద్‌రెడ్డి, బీఎంఆర్‌లకి విఎస్‌యు గౌరవ డాక్టరేట్లు



*జూన్ 9వ తేదీన జరగనున్న విఎస్‌యు స్నాతకోత్సవ వేడుకల్లో ఈసారి మన నెల్లూరీయులు.. ప్రస్తుత హైదరాబాద్ నివాసి 'పద్మభూషణ్' కెఐ వరప్రసాద్‌రెడ్డి, మన జిల్లాకి చెందిన రాజ్యసభ సభ్యులు బీద మస్తాన్‌రావు (బీఎంఆర్)లు రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ చేతులమీదుగా ప్రతిష్టాత్మకమైన గౌరవ డాక్టరేట్‌లను అందుకోబోతున్నారు. వివిధ రంగాల్లో విశేష కృషిచేసి, అత్యున్నత స్థాయినందుకున్న వారికి ప్రదానం చేసే ఈ అవార్డులకు విఎస్‌యు వారు వీరిని ఎంపికచేశారు. వీరితో పాటు అంతర్జాతీయ ఖ్యాతి గడించిన ప్రొఫెసర్ గోబర్ధన్‌దాస్ (భోపాల్) కూడా ఉన్నారు. నెల్లూరు సమీపంలోని విపిఆర్ కన్వెన్షన్ సెంటర్ ఈ స్నాతకోత్సవ వేడుకలకు వేదిక కాబోతోంది.*

విక్రమసింహపురి విశ్వవిద్యాలయం 10, 11, 12వ స్నాతకోత్సవ వేడుకలు సంయుక్తంగా జూన్ 9వ తేదీన నెల్లూరులోని కనుపర్తిపాడు–గొలగమూడి రోడ్డులో ఉన్న విపిఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో అత్యంత వైభవంగా నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. విశ్వవిద్యాలయ గౌరవ వైస్–ఛాన్సలర్ ప్రొఫెసర్ అల్లం శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఈ వేడుకలు జరుగనున్నాయి. ఈ సందర్భంగా వివిధ రంగాలలో దేశ వ్యాప్తంగా అపారమైన సేవలందించిన వారికి గౌరవ డాక్టరేట్‌లు బహుకరిస్తున్నారు. వారి వివరాలివి!..

### బహుముఖ ప్రజ్ఞాశాలి.. వరప్రసాద్‌రెడ్డి

బయోటెక్నాలజీ రంగంలో భారతదేశ ఖ్యాతిని అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లిన ప్రముఖ శాస్త్రవేత్త, పారిశ్రామికవేత్త 'పద్మభూషణ్' డాక్టర్ కోడూరు ఈశ్వర వరప్రసాద్‌రెడ్డి. భారతీయ వైద్యరంగంలోనే హెపటైటిస్–బీ వ్యాక్సిన్ తయారీకి ఆద్యులు కూడా ఆయనే. దేశానికే గర్వకారణమైన శాస్త్రవేత్తగా ఆయన ఖ్యాతినార్జించారు. నెల్లూరుజిల్లా తోటపల్లిగూడూరు మండలం పాపిరెడ్డిపాళెం వారి స్వస్థలం. 1993లో హైదరాబాద్ కేంద్రంగా శాంతా బయోటెక్నిక్స్ లిమిటెడ్ సంస్థను స్థాపించారు. దేశంలోనే రీకాంబినెంట్ హ్యూమన్ హెల్త్‌కేర్ ఉత్పత్తులను సొంతంగా అభివృద్ధి చేసి, మార్కెట్ చేసిన ఘనత ఆ సంస్థకే దక్కుతుంది. దేశంలో మొట్టమొదటిసారిగా స్వదేశీ సాంకేతికతతో కూడిన హెపటైటిస్–బి వ్యాక్సిన్‌ను, ఆ తర్వాత కాలంలో అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన ఎన్నో ప్రాణరక్షక మందులు, వ్యాక్సిన్లను అత్యంత తక్కువ ధరకే సామాన్యులకు అందుబాటులోకి తెచ్చిన ఘనత వరప్రసాద్‌రెడ్డికే దక్కుతుంది. ఇవన్నీ ప్రపంచ ఆరోగ్య సంస్థ గుర్తింపు పొందాయి కూడా. వీరి సేవలను గుర్తిస్తూ భారత ప్రభుత్వం 2005లో ప్రతిష్టాత్మకమైన పద్మభూషణ్ పురస్కారంతో సత్కరించింది. సాహితీరంగంలోనూ ఆయన సేవలు విశేషమైనవి. ఇటీవలే ఆయన చదువుకున్న కాకినాడ కాలేజీవారు ఆయనకు గౌరవ డాక్టరేట్‌ను ప్రదానం చేసి సన్మానించారు. అనితరసాధ్యమైన ప్రజ్ఞాపాటవాలతో, నిరుపమానమైన కృషి.. పట్టుదలతో ఆయన ఇప్పటికీ ఆధ్యాత్మిక సేవాపరాయణులుగా, సారస్వతవేత్తగా సమాజానికి విశేషమైన సేవలందిస్తూనే ఉన్నారు. ఇప్పటికే నాలుగు డాక్టరేట్‌లతో పాటు, అనేక ఘనసత్కారాలు, పురస్కారాలు అందుకున్న బహుముఖ ప్రజ్ఞాశాలి ఆయన. ఇప్పుడు ఆయన పుట్టిన గడ్డపై 5వ డాక్టరేట్ అందుకోనుండడం విశేషం!.

### ఆక్వా అభివృద్ధి ప్రదాత.. బీఎంఆర్ :

ఆక్వాకల్చర్ రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చి, గ్రామీణ ఆర్థికాభివృద్ధికి మరియు పారిశ్రామిక ప్రగతికి విశేష కృషి చేసినందుకు బీఎంఆర్ (బీద మస్తాన్ రావు)కు కూడా ఈ సందర్భంగా విఎస్‌యు వారు డాక్టరేట్ ప్రదానం చేయనున్నారు. బీఎంఆర్ స్వస్థలం..నెల్లూరు జిల్లా అల్లూరు మండలంలోని ఇస్కపల్లి గ్రామం. 1991లో బీఎంఆర్ గ్రూప్ ఆఫ్ ఇండస్ట్రీస్‌ను స్థాపించారు. భారతదేశంలో తీవ్రమైన వ్యాధుల బారినపడి నష్టపోతున్న రొయ్యల సాగును కాపాడటానికి 2004–2009 మధ్యకాలంలో ఎనలేని కృషి చేశారు. వీరి కృషితో భారత ప్రభుత్వం అక్వారంగానికి వాణిజ్య అనుమతులు ఇవ్వడమే కాక, నేడు భారత్ ప్రపంచంలోనే ప్రముఖ రొయ్యల ఎగుమతి దేశంగా ఎదగడానికి కారణమైంది. బీఎంఆర్ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా నెల్లూరు జిల్లాలోని 5 లక్షల మందికి పైగా జనాభాకు విద్య, ఉచిత వైద్య శిబిరాలు, కంటి ఆపరేషన్లు, ఆర్‌ఓ ప్లాంట్ల ద్వారా తాగునీరు మరియు ఉపాధి అవకాశాలను కల్పించారు. వీరి సంస్థల ద్వారా సుమారు 6,000 మందికి ప్రత్యక్షంగా, 15,000 మందికి పరోక్షంగా ఉపాధి లభిస్తోంది. 2009–2014 మధ్య ఆయన శాసనసభ్యునిగా పనిచేశారు. ప్రస్తుతం రాజ్యసభ సభ్యునిగా ఉంటూ పార్లమెంటులో ప్రజాసమస్యలపై మరియు వ్యవసాయ, మత్స్య రంగాల విధానాల రూపకల్పనలో చురుకైనపాత్ర పోషిస్తున్నారు.

# 'రొట్టెల పండుగ' వచ్చేస్తోంది

## • జూన్ 26 నుంచి వేడుకలు ప్రారంభం

రొట్టెల పండుగ వచ్చేస్తోంది. మత సామరస్యానికి ప్రతీకగా నిలిచి, దేశవిదేశాల్లో సైతం ప్రఖ్యాతిగాంచిన నెల్లూరు బారాషహీద్ దర్గాలో ప్రతిష్టాత్మకమైన రొట్టెల పండుగ నిర్వహణకు సన్నాహాలు ప్రారంభమయ్యాయి. జూన్ 26 నుంచి 5 రోజుల పాటు ఈ పండుగ వేడుకతో నెల్లూరంతా భక్తజనంతో క్రిక్కిరిసిపోతుంది. పండుగ ఏర్పాట్ల గురించి టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి ఇటీవల సంబంధిత దర్గా ప్రముఖులతో అధికారులతో సమావేశమై సమీక్షించారు. ఈసారి ఈ పండుగకు ప్రపంచవ్యాప్తంగా కనీసం 30 లక్షలమంది రావచ్చని అధికారులు అంచనావేసి, అందుకు తగ్గ మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు.



## జేఇఇ-అడ్వాన్స్‌డ్‌లో..
# 'కిషోర్స్ రత్నం' అద్భుత విజయాలు



ర్యాంకులు సాధించిన విద్యార్థినీవిద్యార్థులను అభినందిస్తున్న రామ్మూర్తినాయుడు

ఇటీవల విడుదలైన జేఇఇ-అడ్వాన్స్‌డ్-2026 ఫలితాలలో నెల్లూరులోని డా.కిషోర్స్ రత్నం జూనియర్ కళాశాల విద్యార్థులు అద్భుత విజయాలు సాధించారు. డి.పునీత్‌కుమార్ 314వ ర్యాంకు, డి.ప్రణవి 935, బి.లక్ష్మీచైతన్య 2384, ఇ.వెంకటభాస్కర్ 2597, కె.వెంకట జివితేష్ 3016, జి.వి.సాయిదీపక్ 5745 కేటగిరీ ర్యాంకులు, వి.గౌతమ్ రెడ్డి 29013 ఆలిండియా ర్యాంకు సాధించారు. అంతేకాక, కళాశాలలోని 14 మంది విద్యార్థులు 'నీట్'లో సీట్లు పొందడానికి అర్హత సాధించడం ఎంతైనా అభినందనీయం. తమ కళాశాలలో జరుగుతున్న విశిష్టమైన విద్యాబోధన, ఒత్తిడి లేని విద్య, నిపుణులైన అధ్యాపక బృందం ప్రతిభ, విద్యార్థుల నిరంతర కృషి, ఈ విజయాలకి కారణమని డా.కిషోర్స్ రత్నం విద్యాసంస్థల డైరెక్టర్లు డా.కృష్ణకిషోర్, వాసంతి కిషోర్‌లు తెలిపారు. ఈ ఫలితాల్లో విజయఢంకా మోగించిన విద్యార్థులను వారు అభినందించారు. విద్యాసంస్థల జనరల్ మేనేజర్ రామ్మూర్తినాయుడు మాట్లాడుతూ, ఒకే బ్రాంచ్ నుంచి తక్కువ మంది విద్యార్థులతో అద్భుత విజయాలు సాధించడం సంతోషదాయకమన్నారు. ఈ కార్యక్రమంలో అకడమిక్ అడ్వయిజర్ నరసయ్యానాయుడు, నీట్ అకడమిక్ హెడ్ రఘుపతినాయుడు, ప్రిన్సిపాల్ కె.వి.డి మనోజ్‌కుమార్‌తో పాటు అధ్యాపకులు, విద్యార్థులు, తల్లితండ్రులు పాల్గొన్నారు.

# మహానాడు తీర్మానంపై..మహిళల సంబరాలు



ఎన్టీఆర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న తెలుగు మహిళలు

మహానాడు వేదికగా మహిళామణులకు 33 శాతం రిజర్వేషన్ కల్పించాలన్న యువనేత నారా లోకేశ్ ప్రతిపాదన పట్ల నెల్లూరు జిల్లా తెలుగు మహిళా విభాగం హర్షాతిరేకాలు వ్యక్తం చేసింది. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని నెల్లూరులోని నర్తకీ సెంటర్‌లో స్వర్గీయ నందమూరి తారకరామారావు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఎన్టీఆర్, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, యువనేత నారా లోకేశ్‌ల చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. భారీ కేక్ కట్‌చేసి సంబరాలు జరుపుకున్నారు. తెలుగుదేశం పార్టీ అంటే, మొదటినుంచి మహిళా అభ్యున్నతికే కట్టుబడిన పార్టీ అని, అప్పట్లోనే ఎన్టీఆర్ మహిళలకు చట్టసభల్లో అవకాశం ఇచ్చి, ఆస్తిలో భాగం కల్పించారన్నారు. వితంతు పెన్షన్లను ప్రవేశపెట్టిన ఘనత కూడా ఎన్టీఆర్‌కే దక్కుతుందని మహిళా నాయకురాళ్లు చెప్పారు. టీడీపీ పార్లమెంటు మహిళా అధ్యక్షురాలు కపిర రేవతి, డిప్యూటీ మేయర్ తాసిన్, 52వ డివిజన్ కార్పొరేటర్ రేష్మా, 54వ డివిజన్ కార్పొరేటర్ సఫియా, మహిళా నాయకురాలు భూలక్ష్మి, క్లస్టర్స్ శైలమ్మ,అన్నపూర్ణ, 3వ డివిజన్ అధ్యక్షురాలు విజయమ్మ, మహిళా క్లస్టర్స్ శ్రీలక్ష్మి, శిల్ప, గౌసియా, చందన తదితరులు పాల్గొన్నారు.

# నెల్లూరు కబుర్లు

# పింఛన్ల పంపిణీలో కలెక్టర్



పింఛన్ పంపిణీ చేస్తున్న కలెక్టర్ హిమాన్షు శుక్ల

జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల ఈనెల 1న నెల్లూరు నగరం లోని 42వ డివిజన్ అమీన్‌నగర్‌లో ఇంటింటికీ వెళ్లి పింఛను దారులకు స్వయంగా పింఛన్లు అందజేయడంతో లబ్ధిదారులు, స్థానికులు సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జి.రమణమ్మకు, ఎస్‌కె పర్వీన్‌కి 4వేల రూపాయల వంతున వితంతు పింఛన్లను కూడా కలెక్టర్ అందజేశారు. అనారోగ్యంతో మంచం నుంచి కదలలేని పరిస్థితుల్లో ఉన్న ఎస్‌డీ గౌస్‌అహ్మద్‌కు బెడ్‌రిడెన్ పింఛన్ కింద 15వేల రూపాయలను కలెక్టర్ అందజేసి, స్థానికంగా ఉన్న పింఛనుదారులతో ఆత్మీయంగా మాట్లాడుతూ, వారి కష్టసుఖాలను తెలుసుకుంటూ, జిల్లా కలెక్టర్ నేరుగా ప్రజల వద్దకు వచ్చి, చూపుతున్న అభిమానాన్ని స్థానిక ప్రజలు కొనియాడారు.

## అంధత్వ రహిత నెల్లూరే లక్ష్యంగా..
# మంత్రి నారాయణ సేవలు



నేత్ర పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

అంధత్వ రహిత నెల్లూరే లక్ష్యంగా, ఒక్క రూపాయి కూడా రోగులకు ఖర్చు లేకుండా ఉచిత కంటి ఆపరేషన్లు, అద్దాల పంపిణీ చేస్తూ నెల్లూరులో మంత్రి నారాయణ ప్రారంభించిన 'నేత్రజ్యోతి-దంత సురక్ష' ఉచిత వైద్యశిబిరాలు నగర ప్రజలకు ఎంతగానో ఉపయోగపడుతున్నాయి. నెల్లూరు నగర ప్రజల ఆరోగ్యమే మహాభాగ్యంగా భావించి, మంత్రి నారాయణ తన సొంత నిధులతో ఈ కార్యక్రమాలు నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ఇందులో భాగంగా ఇటీవల నగరంలోని 4వ డివిజన్, జాకీర్ హుస్సేన్‌నగర్ న్యూ కాలనీ వద్ద ఉచిత వైద్యశిబిరాలు నిర్వహించారు. నగర అధ్యక్షుడు మామిడాల మధు, వైద్యాధికారిణి సుధ తదితరులు పాల్గొని రోగులకు ఉచిత వైద్యసేవలందించారు. మార్చి 8న ప్రారంభమైన ఈ కార్యక్రమాల ద్వారా ఇప్పటివరకు 7,600 మందికి పైగా ఉచిత పరీక్షలు నిర్వహించి, 4,700 మందికి పైగా ఉచితంగా కంటి అద్దాలను పంపిణీ చేశామని వారు తెలిపారు. నాల్గవ డివిజన్ ప్రెసిడెంట్ నారాయణరెడ్డి, యూనిట్ ఇన్‌చార్జ్‌లు మాల్యాద్రి, సుమన్, మరియు సభ్యులు షఫీ, శేషమ్మ, నిర్మల, సంపూర్ణ, సత్యవతి, స్థానిక టీడీపీ ముఖ్య నేతలు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# సాయిదర్బార్‌లో.. శ్రీ వేంకటేశ్వరస్వామి కళ్యాణం

నెల్లూరు బాలాజీనగర్ చివర పద్మావతినగర్‌లో ఉన్న శ్రీసాయిదర్బార్ అద్దాల మందిరం 21వ వార్షికోత్సవం సందర్భంగా శ్రీసాయిమాత నిత్య అన్నప్రసాదాలయం ద్వారకామాయిలో ఇటీవల లోకకల్యాణార్థం



శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవేంకటేశ్వరస్వామి వారి కళ్యాణ మహోత్సవం అన్నమయ్య కీర్తనలతో, భక్తుల పందరి భజనలతో, కోలాటాలతో వైభవంగా జరిగింది. వేద పండితులు వేదగిరి ఫణిశర్మ, తారకేష్‌శర్మల ఆధ్వర్యంలో కల్యాణోత్సవం జరిగింది. మందిరం చైర్మెన్ మధు సాయి నేతృత్వంలో జరిగిన ఈ ఉత్సవంలో మందిరం గౌరవ సలహాదారులు పాబోలు రామసుబ్బయ్య పాల్గొన్నారు.

# శేషజీవితం హాయిగా గడపండి
## జిల్లా ఎస్పీ అజిత ఆకాంక్ష



రిటైర్ అయిన పోలీసు సిబ్బందిని సన్మానిస్తున్న జిల్లా ఎస్పీ అజిత వేజెండ్ల

పోలీసు సిబ్బందిగా పనిచేసి ఉద్యోగ విరమణ పొందినవారు తమ శేషజీవితాన్ని హాయిగా గడపాలని జిల్లా ఎస్పీ అజిత వేజెండ్ల ఆకాంక్షించారు. ఇటీవల నెల్లూరులోని ఉమేష్‌చంద్ర సమావేశ మందిరంలో జరిగిన కార్యక్రమంలో ఆమె పాల్గొని, పలువురు ఉద్యోగ విరమణ పొందిన వారిని సన్మానించి వీడ్కోలు తెలిపారు. మహిళా పోలీస్ స్టేషన్ డీఎస్పీ యు. సత్యనారాయణ, కోవూరు ఎస్ఐ షేక్ ఖాదర్‌బాషా, నెల్లూరులోని సంతపేట, నార్త్ ట్రాఫిక్ ఎస్ఐలు షేక్ సుల్తాన్‌బాషా, ఎం.రాజేశ్వరరావు, ఏఆర్ఎస్ఐ సి.శ్రీనివాసరావు, సీనియర్ అసిస్టెంట్ జి.శ్రీనివాసులు, నవాబుపేట కానిస్టేబుల్ ఇ.శ్రీనివాసులు ఉద్యోగ విరమణ చేయడంతో జిల్లా పోలీసు అధికారులు వారిని సత్కరించి వారి సేవలను కొనియాడారు. ఏఎస్పీ సిహెచ్ సౌజన్య, నగర ఏఎస్పీ దీక్ష, ఏఆర్ డీఎస్పీ చంద్రమోహన్, నెల్లూరు రూరల్ డీఎస్పీ ఘట్టమనేని శ్రీనివాసరావు, ఎస్బీ డీఎస్పీ ధీరజ్, ఏఓ చంద్రమౌళి, ఏఆర్ అడ్మిన్ ఆర్ఐ హరిబాబు, పోలీసు అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడు మద్దిపాటి ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

## గ్రోసు సుబ్బారావుకు..
# జాతీయస్థాయి పదవి



నెల్లూరుజిల్లాలోనే కాక, రాష్ట్రవ్యాప్తంగా ఉన్న గాండ్ల-తెలికుల సంక్షేమానికి నిరంతరం కృషిచేస్తున్న గ్రోసు సుబ్బారావు (మురళీకృష్ణ హోటల్స్ అధినేత) ఇటీవల జాతీయస్థాయిలో పదవి లభించింది. జాతీయ తేలీ సాహూ మహా సంఘఠన్ నేషనల్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఆయన ఎంపికయ్యారు. దీంతో, జిల్లాలోని ఆ కులస్తుల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. తమ కులస్తుల అభివృద్ధికి ఎంతోకాలంగా ఎనలేని సేవలందించిన స్వర్గీయ గ్రోసు గోపాలయ్య తనయుడైన సుబ్బారావు, తమ సంఘానికి రాష్ట్ర శాఖ అధ్యక్షులుగా తనవంతు సేవలందిస్తున్నారని, ఈ నేపథ్యంలో వారికి జాతీయస్థాయి పదవి లభించడం సంతోషకరమని అఖిల గాండ్ల తెలికుల సంక్షేమ సంఘం ఆంధ్రప్రదేశ్ శాఖ ప్రధాన కార్యదర్శి బొర్రా మధుసూదన్ ఒక ప్రకటనలో శుభాకాంక్షలు తెలిపారు. కులసంక్షేమానికి పాటుపడుతున్న గ్రోసు సుబ్బారావుకు మరెన్నో ఉన్నత స్థాయి పదవులు రావాలని కోరుకుంటున్నామని ఆయన పేర్కొన్నారు.

# ఫ్రైడే..నో ట్రావెల్ డే!
## - ఇంధన పొదుపు బాటలో మంత్రి ఆనం -

'నా దేశం నా బాధ్యత' అంటూ భారత ప్రధాని నరేంద్ర మోడీ పిలుపుమేరకు, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సూచనలతో ఇంధన పొదుపు మంత్రం పాటించేందుకు నిర్ణయం తీసుకున్నానని రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి తెలిపారు. ఇకపై తాను కూడా శుక్రవారం రోజున పర్యటనలు మానుకుంటున్నానని, ఫ్రైడే- నో ట్రావెల్ డేగా పరిగణిస్తున్నానని ప్రకటించారు. అత్యవసర ప్రయాణ పరిస్థితుల్లో... డీసెల్ రహితంగా, విద్యుత్ వాహనాలను మాత్రమే వినియోగిస్తామని, అనవసరమైన ఇంధన వినియోగాన్ని తగ్గించడానికి తనవంతు బాధ్యతగా పొదుపు చర్యలు చేపట్టానని ఆయన తెలిపారు. ఇకపై విద్యుత్ వాహనాల వినియోగానికి ప్రత్యేక చొరవ చూపుతున్నట్లు చెప్పారు. 'దుబారా తగ్గించి దేశాన్ని కాపాడుదాం' అనేది ప్రస్తుత ప్రభుత్వ ప్రధాన విధానమని, అందుకు తగినట్లుగా తాను తన ప్రయాణాల్లో ఇలాంటి మార్పులు చేసుకుంటున్నానని ఆయన తెలిపారు.

# ప్రభుత్వ బాలికల ఐటీఐలో జాబ్‌మేళా

నెల్లూరు వెంకటేశ్వరపురంలోని ప్రభుత్వ బాలికల ఐటీఐలో ఈనెల 1న క్యాంపస్ ప్లేస్‌మెంట్ల ద్వారా ఉద్యోగార్థులను ఎంపిక చేసుకున్నారు. సుమారు పది కంపెనీల వారు ఇంటర్వ్యూలు నిర్వహించగా, 150 మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపిక కావడం విశేషం.




# పొగాకు రైతుల కష్టాలు విన్న మంత్రి ఆనం

## • ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా



డీసీ పల్లిలోని పొగాకు కేంద్రాన్ని పరిశీలిస్తున్న మంత్రి ఆనం రామనారాయణరెడ్డి

పొగాకు రైతులు ఎదుర్కొంటున్న ధరల సమస్యలు, మార్కెటింగ్ ఇబ్బందుల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం కృషిచేస్తుందని, పొగాకు రైతులకు ప్రభుత్వం అండగా ఉంటుందని రాష్ట్ర దేవాదాయ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి చెప్పారు. ఈనెల 1న ఆయన మర్రిపాడు మండలం డీసీ పల్లిలోని పొగాకు వేలం కేంద్రాన్ని స్థానిక రైతులతో కలిసి సందర్శించి రైతుల సమస్యలను తెలుసుకున్నారు. పొగాకు రైతులందరూ తమ ఇబ్బందులను మంత్రికి వివరిస్తూ, తమకు గిట్టుబాటు ధర కల్పించాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం, మంత్రి ఆనం మాట్లాడుతూ, పొగాకు సాగులో ఒక సంవత్సరం మంచి దిగుబడి వస్తే, మరో సంవత్సరం వరదలు, కరువు, తెగుళ్లు, వాతావరణ మార్పులు వంటి అనేక ప్రతికూల పరిస్థితులు ఎదురవుతుంటాయన్నారు. అలాంటి సందర్భాల్లో రైతులకు ప్రభుత్వం అండగా నిలవడం తన బాధ్యతగా భావిస్తుందన్నారు. పొగాకు రైతుల సమస్యలను ముఖ్యమంత్రి, వ్యవసాయ శాఖ మంత్రి, కేంద్ర ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. ఇప్పటికే కేంద్ర ఆర్థిక శాఖ మంత్రికి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆ విషయమై లేఖ రాసినట్లు వెల్లడించారు. త్వరలో ఢిల్లీలో జరిగే సమావేశాల్లో పాల్గొని రైతుల సమస్యలను నేరుగా కేంద్ర ప్రభుత్వానికి వివరించనున్నట్లు చెప్పారు. పొగాకు కొనుగోళ్లలో రైతులకు గిట్టుబాటు ధర లభించేలా చర్యలు తీసుకోవాలని కంపెనీలను కోరుతామని తెలిపారు. గతంలో అమలుచేసిన క్రాప్ హాలిడే కారణంగా రాష్ట్రంలోని పొగాకు సాగు విస్తీర్ణం తగ్గిపోగా, ఇతర రాష్ట్రాలు ఆ అవకాశాన్ని వినియోగించుకుని తమ ఉత్పత్తిని పెంచుకున్నాయని పేర్కొన్నారు. ఫలితంగా పొగాకు ఉత్పత్తి కోటాల పంపిణీలో రాష్ట్రానికి నష్టం జరిగిందని వివరించారు. ఈ అంశాన్ని కూడా కేంద్ర ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు.

# కాకాణిదంతా..అడ్డగోలు రాద్ధాంతమే!

## ఎమ్మెల్యే సోమిరెడ్డి విమర్శ



కండలేరు స్పిల్ వే వరద కాలువ పనులను పరిశీలిస్తున్న సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి

జిల్లాలో జరిగిన నీటిపారుదల పనుల విషయంలో మాజీమంత్రి కాకాణిదంతా అడ్డగోలు రాద్ధాంతమేనని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి కొట్టిపారేశారు. ఇటీవల పొదలకూరు మండలం అంకుపల్లి పరిధిలో జరుగుతున్న కండలేరు స్పిల్ వే వరద కాలువ పనులను పరిశీలించిన సందర్భంగా సోమిరెడ్డి మాట్లాడుతూ, పారదర్శకంగా పనులు జరుగుతుంటే కాకాణి ఎందుకు విమర్శలు చేస్తున్నారో అర్థం కావడం లేదన్నారు. మీడియా ప్రతినిధులను కూడా తీసుకువెళ్లి అక్కడ జరుగుతున్న పనులను ఆయన విశదీకరించారు. కండలేరు స్పిల్‌వే నుంచి వావింటపర్తి వరకు వరద కాలువ పటిష్టతకు రూ.50 లక్షలతో అద్భుతంగా పనులు జరుగుతున్నాయని ఆయన చెప్పారు. ప్రతి పనిని జరగక ముందు, జరిగిన తర్వాత జీపీఎస్ ఫొటోలతో రికార్డు చేసి పెడుతున్నామని, కాకాణికి అవి కనపడడం లేదా అని ఆయన అన్నారు. పనులు జరగకుండా ఒక్క బిల్లు చేసినా తాను ఒప్పుకునేది ఉండదని ఆయన అధికారులకు స్పష్టం చేశారు. అంతేకాదు, పనుల్లో ఏ చిన్న పొరపాటు చేసినా అధికారులపై తానే ఫిర్యాదు చేసి సస్పెన్షన్ చేయిస్తానని కూడా హెచ్చరించారు. మొంథా తుఫాన్ సమయంలో జిల్లాలో ఎఫ్.డీ.ఆర్ నిధులు రూ.93కోట్లను ఇటీవల కలెక్టర్ మంజూరు చేశారని, ఉత్తర్వుల కాపీ బయటకు వచ్చిందో లేదో.. మరుక్షణమే సోమిరెడ్డి రూ.100 కోట్లు తినేశాడంటూ కాకాణి విమర్శలు చేస్తున్నాడని, ఇదెక్కడి రాద్ధాంతమని ఆయన విమర్శించారు.

# అవ్వా తాతలకి శ్రీధర్‌రెడ్డి పింఛన్ల పంపిణీ



పింఛన్ల పంపిణీలో భాగంగా ఈనెల 1వ తేదీ ఉదయం నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి 21వ డివిజన్ ఉమ్మారెడ్డిగుంటలో ఇంటింటికీ వెళ్లి అవ్వాతాతలకు పింఛన్లు పంపిణీ చేశారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేనివిధంగా, రాష్ట్రంలో అత్యధిక మొత్తంలో పింఛన్ల పంపిణీ జరుగుతోందని ఆయన ఈ సందర్భంగా తెలిపారు. చెప్పినమాట ప్రకారం ప్రతినెలా 1వ తేదీన క్రమం తప్పకుండా పింఛన్లు ఇస్తున్నందుకు సీఎం చంద్రబాబుకు ప్రజల తరఫున ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఆయన వెంట ఆయన సోదరుడు, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, క్లస్టర్ ఇన్‌ఛార్జిలు పాల్గొన్నారు.




కీ॥శే॥ తుంగా రాజగోపాలరెడ్డి గారు
వ్యవస్థాపకులు, 'లాయర్' వార్తాపత్రిక



కీ॥శే॥ కాకుటూరు చంద్రశేఖర్‌రెడ్డి గారు
మినగల్లు

లాయర్ 45 YEARS

వారం వారం.. వార్తల మణిహారం
పాఠకులకు ప్రతివారం.. అక్షర సుమహారం

లాయర్
వార్తాపత్రిక
45 సంవత్సరాలు పూర్తి చేసుకొని
46వ పడిలో అడిగిడుతున్న సందర్భంగా
45వ వార్షికోత్సవ శుభాకాంక్షలు.



కాకుటూరు అనిల్‌కుమార్‌రెడ్డి
నీలాద్రి ప్యాకేజింగ్స్, చెన్నై.

# బాలూ స్మారకం.. చెరిగిపోని జ్ఞాపకం!



**నెల్లూరులో జూన్ 4వ తేదీ గురువారం ..ఒక పెద్ద 'సంగీత పండుగ' జరిగింది. చల్లని సాయం సంధ్యాసమయంలో పురజనులు, పురప్రముఖులు..ఎందరో కళాకారులు, సంగీతాభిమానులకు ఓ మధుర జ్ఞాపకంగా..బాలూ స్మారకం ఆవిష్కరణోత్సవం నయనానందకరంగా సాగింది. మన నెల్లూరీయుడు..గాన గంధర్వుడు..వేలాది పాటలతో ప్రపంచవ్యాప్తంగా అశేష ప్రజలను అలరించిన విశ్వవిఖ్యాత సంగీతజ్ఞుడు .శ్రీపతి పండితారాధ్యుల బాలసుబ్రహ్మణ్యం (ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం) 80వ జయంతి సందర్భంగా, ఆయన పుట్టినగడ్డ అయిన నెల్లూరు ఆ మహనీయుని మధుర జ్ఞాపకాలతో పులకించిపోయింది. స్థానిక మినీబైపాస్‌రోడ్డులోని ఎన్టీఆర్ పార్కు వద్ద అన్నమయ్య కూడలిలో..బాలూకి అత్యంత ప్రీతిపాత్రమైన శ్రీమాన్ తాళ్ళపాక అన్నమాచార్యుల వారి విగ్రహం ఎదురుగా, బాలూ స్మారకంగా అత్యద్భుతంగా నిర్మాణం గావించిన పదడుగుల కాంస్య విగ్రహాన్ని నెలకొల్పడం..పురప్రజలను ఆనందపరవశులను చేసింది. నెల్లూరు ముద్దుబిడ్డ..భారత 13వ ఉప రాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు బాలూ విగ్రహాన్ని ఆవిష్కరించి, బాలూను స్మరించుకుంటూ నివాళులర్పించారు.**

ఎట్టకేలకు నెల్లూరీయుల కల సాకారమైంది. బాలూ అభిమానులు కోరుకున్న కోరిక నెరవేరింది. బాలూ స్మారకాన్ని.. ఓ చెరిగిపోని జ్ఞాపకంగా నిలపాలని, పదికాలాల పాటు ఆ మహనీయుని పాటలను-మాటలను గుర్తుంచుకునేలా ఒక స్మారకాన్ని ఏర్పాటుచేయాలన్న సంకల్పంతో నెల్లూరీయులు బాలూ విగ్రహస్థాపనకు నడుం బిగించారు. భారత 13వ ఉప రాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడుకు 'లాయర్' పత్రిక అధినేత తుంగా శివప్రభాత్‌రెడ్డి (ప్రభు) తమ సంకల్పాన్ని వివరించగా, వెంటనే ఆ కార్యాన్ని కార్యరూపంలోకి తెచ్చేలా వెంకయ్యనాయుడు నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డికి, రాష్ట్ర పురపాలక మంత్రి పొంగూరు నారాయణకి, నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డికి తగు సూచనలు చేయడంతో, బాలూ విగ్రహ ప్రతిష్ఠాపనకు మార్గం సుగమమైంది. ఆ ముగ్గురూ త్రిమూర్తులై కదిలారు. ఇక జరగనిదేముంటుంది?.. ప్రభుతో పాటు వారి స్నేహబృందమూ కదిలింది. అంతే!..ప్రముఖ శిల్పి కరుణాకర్ వడయార్ బాలూ స్మారకాన్ని అద్భుతంగా తీర్చిదిద్దారు. రికార్డు సమయంలోనే నెల్లూరులో బాలూ విగ్రహ ప్రతిష్ఠాపనకు శ్రీధర్‌రెడ్డి శంకుస్థాపన చేయడం, అప్పుడు అనుకున్నట్లుగానే బాలూ 80వ జయంతి రోజున వెంకయ్యనాయుడు చేతులమీదుగా విగ్రహావిష్కరణ జరగడం.. విశేషం. నెల్లూరోళ్ళు తలచుకుంటే ఎంతపనినైనా సాధిస్తారనేందుకు ఇదొక నిదర్శనంగా కూడా నిలిచింది.

'లాయర్' పత్రిక అధినేత తుంగా శివప్రభాత్‌రెడ్డి ఆధ్వర్యంలో, బాలూ ప్రియశిష్యులు వీరిశెట్టి హజరత్‌బాబు, భారత్ బిల్డర్స్ తాటి చలపతిరావు, ప్రముఖ ఆర్కిటెక్ట్ రామిరెడ్డి సాకేత్ రెడ్డిల సహకారంతో ఈ స్మారకోత్సవం ఆద్యంతం కమనీయంగా రమణీయంగా సాగింది. విగ్రహావిష్కరణ అనంతరం జరిగిన ప్రముఖ గాయనీగాయకులు.. సంగీతవేత్తల మధురగానాల 'స్వర నీరాజనం' బాలూకి సుస్వరహారతిగా అలరారింది.

## ప్రముఖుల రాకతో..సందడే సందడి :

ఈ వేడుకకు వెంకయ్యనాయుడుతోపాటు, పద్మభూషణ్ కె.ఐ వరప్రసాద్‌రెడ్డి, నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఆయన సతీమణి.. కోవూరు శాసనసభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, ఆచార్య సీఎంకె రెడ్డి, శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి, దీపా వెంకట్, కమిషనర్ నందన్, వీరిశెట్టి హజరత్‌బాబు, గ్రోసు సుబ్బారావు, సంగీతవేత్తలు కీరవాణి, మణిశర్మ, గాయకుడు నాగూర్‌బాబు (మనో), బాలూ సతీమణి శ్రీమతి సావిత్రి.. కుటుంబసభ్యులు ఎస్పీ చరణ్, ఎస్పీ శైలజ, శుభలేఖ సుదాకర్, ఎస్పీ వసంత, పల్లవి తదితరులు పాల్గొన్నారు.







### బాలూ స్మారకాన్ని పరిరక్షించుకోవాలి

**- ఎమ్మెల్యే కోటంరెడ్డి**

నెల్లూరుజిల్లా పేరును ప్రపంచవ్యాప్తంగా మార్మోగించిన గానగంధర్వుడు. విశ్వవిఖ్యాత గాయకుడు బాలూ. ఆ మహనీయునికి నెల్లూరులో విగ్రహం స్థాపించడం, రికార్డు స్థాయిలో ఆవిష్కరించడం సంతోషదాయకం. పెద్దలు వెంకయ్యనాయుడు సూచనలతో, లాయర్ పత్రిక సంపాదకుడు శివప్రభాత్‌రెడ్డి ఆలోచనలతో, అందరం కలసి ఇక్కడ బాలూ స్మారకం నిర్మించడం, ఒక మంచి పరిణామం. అయితే, విగ్రహాలు పెట్టడం తేలిక.. కానీ వాటిని పరిరక్షించుకోవడం కష్టం. బాలూ విగ్రహం పదికాలాల పాటు పదిలంగా ఉండాలంటే, ఇక్కడున్న ఎన్టీఆర్ పార్కును, బాలూ విగ్రహాన్ని సంరక్షించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. అందుకు వేమిరెడ్డి వంటి పెద్దలు విపిఆర్ ఫౌండేషన్ ద్వారా సంకల్పించాలని కోరుతున్నా. నేను ఉన్నంతకాలం ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం గారి వర్ధంతి, జయంతి కార్యక్రమాలను నిర్వహిస్తా.

### దానశీలి మన బాలూ

**- ఆచార్య సీఎంకెరెడ్డి**

బాలూ కేవలం గాయకుడే కాదు..గొప్పగుణం ఉన్న దానశీలి. చివరికి నెల్లూరులోని తన నివాసాన్ని కూడా కంచికామకోటి పీఠం వారికి వితరణగా సమర్పించి, తనకంటూ ఇక్కడ ఓ ఇల్లు లేకుండా చేసుకున్నాడు. ఎవరికైనా సాయం చేయాలంటే, బాలూ ముందుండేవారు. ఒకప్పట్లో డబ్బులేక ఇబ్బందులు పడుతున్న ఓ చెస్ ప్లేయర్‌కి బాలూ తన వితరణతో సాయం చేశారు. ఆ చెస్ క్రీడాకారుడు మరెవరో కాదు..మూడుసార్లు ప్రపంచ చెస్‌లో అద్వితీయంగా రాణించిన విశ్వనాథన్ ఆనంద్. అంతటి దానగుణం గాయకుడైన బాలూలో ఉండడం బాలూకే కాదు, మనందరికీ గర్వకారణం.

### బాలూ విగ్రహాన్ని, పార్కును పరిరక్షిస్తాం

**- ఎంపీ వేమిరెడ్డి**

బాలూగారి 80వ జయంతి నాడు బాలూ గారి స్మారకాన్ని వెంకయ్యనాయుడుగారి చేతులమీదుగా ఆవిష్కరించుకోవడం ఒక భాగ్యం. అమెరికాలో నాకు అవార్డు వచ్చినప్పుడు 2018లో నా సేవలను ప్రస్తావిస్తూ ఒక అద్భుతమైన పాటను ప్రభు రాయించారు. ఆ పాటను బాలూ గారు పాడడం నా అదృష్టంగా భావిస్తున్నా. ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, ప్రభు కోరుతున్నట్లుగా, బాలూ గారి విగ్రహ నిర్వహణను మేమే చేపడతాం. బాలూ గారికి చేసే సేవ కూడా ఒక అదృష్టమే.

### 'లాయర్' వార్షికోత్సవం.. బాలూ స్మృతికి అంకితం

**- తుంగా శివప్రభాత్‌రెడ్డి**

బాలూ స్మారక విగ్రహ ప్రతిష్ఠాపనకు సహకరించిన పెద్దలు వెంకయ్యనాయుడుకు, పద్మభూషణ్ కెఐ వరప్రసాద్‌రెడ్డికి, శ్రీయుతులు మంత్రి నారాయణ, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డికి-ఆయన సతీమణి ప్రశాంతిరెడ్డికి, ఆచార్య సీఎంకె రెడ్డి, శ్రీసిటీ ఎం.డీ రవీంద్ర సన్నారెడ్డికీ, అందరికీ శిరసువంచి కృతజ్ఞతలు. బాలూ కుటుంబసభ్యులకు, ఈ కార్యక్రమంలో పాల్గొని బాలూకి స్వరనీరాజనాలర్పించిన శ్రీయుతులు కీరవాణి, మణిశర్మ, నాగూర్‌బాబు (మనో), ఇంకా ఎందరో మిత్రులు..అందరికీ ధన్యవాదాలు. జూన్5న జరిగే మా 'లాయర్' పత్రిక 45వ వార్షికోత్సవాన్ని కూడా బాలూ స్మృతికి అంకితం చేస్తున్నాం.

### నెల్లూరు ముద్దుబిడ్డ బాలూ

**- ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి**

మహాగాయకుడు, తన పాటలు మాటలతో ప్రజల మనసుల్లో ఆయన చిరస్థాయిగా నిలచిపోయారు. మరచిపోలేని వ్యక్తి బాలూ. మన నెల్లూరు ముద్దుబిడ్డ బాలూగారి విగ్రహాన్ని ఇంత అద్భుతంగా నిర్మించడం హర్షదాయకం. ప్రభన్న ఏ కార్యక్రమం చేపట్టినా విజయవంతంగా నిర్వహిస్తారు కూడా. బాలూ గారి విగ్రహ పరిరక్షణను విపిఆర్ ఫౌండేషన్ చేపడుతుందని చెప్పడానికి సంతోషిస్తున్నా. ఇది మాకెంతో భాగ్యం కూడా.

### బాలూ ఆత్మీయత మరువలేనిది

**- దీపా వెంకట్**

మా నాన్నగారికి, ఎస్పీబాలూ గారికి ఎంతో ఆత్మీయతానుబంధం ఉంది. బాలూ గారితో నాకు సాన్నిహిత్యం కలగడం నా అదృష్టం. నేను మెసేజ్‌లు ఇవ్వడంలో ఏమైనా చిన్న పొరపాటు చేసినా ఎంతో ఆత్మీయంగా సరిచేసి పంపేవారు. స్వర్ణభారత్ ట్రస్ట్‌లో ఎన్నో కార్యక్రమాల్లో ఆయన పాల్గొని తన గానంతో ప్రజలను మంత్రముగ్ధులను చేసేవారు.

## ఆయనో సంస్కార వారధి... స్వరాల సారథి!

**- గాన గంధర్వుడు బాలూకి వెంకయ్య నివాళి**

అమర స్వర గాయకుడు.. గాన గంధర్వుడు శ్రీపతి పండితారాధ్యుల బాల సుబ్రహ్మణ్యం గారి 80వ జయంతి సందర్భంగా నెల్లూరులో వారి కాంస్య విగ్రహాన్ని ఆవిష్కరించడం, సంగీతార్చన కార్యక్రమాన్ని నిర్వహించడం సంతోషకరమని భారత 13వ ఉప రాష్ట్రపతి, మన నెల్లూరు ముద్దుబిడ్డ ముప్పవరపు వెంకయ్యనాయుడు చెప్పారు. ఈ కార్యక్రమానికి చొరవ తీసుకున్న ప్రతి ఒక్కరికీ పేరుపేరున అభినందనలు తెలియజేస్తున్నానన్నారు. ఈ సందర్భంగా ఎస్పీ బాలు స్మృతికి ఆయన నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, ఎస్పీ బాలు మన ముందు లేకపోవడం విచారకరమని, అయితే వారి స్ఫూర్తిని కొనసాగిస్తూ నిర్వహించే ఇలాంటి కార్యక్రమాలు సజీవమైన వారి స్ఫూర్తిని ఆవిష్కరిస్తూనే ఉంటాయని అన్నారు. ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం జీవితం సినీ సంగీత చరిత్రలోనే ఓ మైలురాయి అని, తెలుగు సినిమా సంగీతానికి ఘంటసాల-బాలూ ద్వయం స్వర్ణయుగం తీసుకొచ్చారని చెప్పడంలో ఎలాంటి సందేహం లేదన్నారు. వారిద్దరూ తెలుగు పాటకు పట్టాభిషేకం చేసి... ప్రేక్షకుల హృదయ సింహాసనంపై కూర్చోబెట్టారని ఆయన అభివర్ణించారు. జీవితంలో కష్టపడి పైకి వచ్చి, ఎంత ఎదిగినా ఒదిగి ఉండే బాలూ స్వభావం తననెంతగానో ఆకట్టుకునేదని, వారి భాష, సంస్కృతుల పట్ల అభిమానం తామిద్దరినీ దగ్గర చేయడమే గాక, అవి తమ మధ్య సంబంధ బాంధవ్యాలు పెరగడానికి కారణమయ్యాయని ఆయన ఈ సందర్భంగా గుర్తుచేసుకున్నారు. తెలుగు మాటకు, తెలుగు పాటకు, తెలుగు సంస్కృతి సంప్రదాయాలకు వారు అందించే గౌరవం అపారమన్నారు. మన భాషను, సంస్కృతిని పరిరక్షించుకోవడమే బాలూ లాంటి వారికిచ్చే నిజమైన నివాళి అన్నారు.

## బాలూ లాంటివారు..శతాబ్దానికి ఏ ఒక్కరో!..

**- పద్మభూషణ్ కెఐ వరప్రసాద్‌రెడ్డి**

'కొన్ని వేల పాటలను పాడి, దేశంలోని అన్ని ముఖ్యమైన భాషల్లోనూ మధురంగా గానం చేసి మెప్పించిన మహా ప్రతిభావంతుడు మన బాలూ!..అలాంటివారు శతాబ్దానికి ఏ ఒక్కరో వస్తారేమో'..అంటూ శాంతా బయోటెక్నిక్స్ వ్యవస్థాపకులు, పద్మభూషణ్ కెఐ వరప్రసాద్‌రెడ్డి అన్నారు. బాలూ స్మారకం ఆవిష్కరణ సందర్భంగా బాలూకి నివాళులర్పించి, బాలూతో తనకున్న ఆత్మీయానుబంధాన్ని ఆయన గుర్తుకు తెచ్చుకున్నారు. మన అదృష్టం కొద్దీ ఆయనతో తిరిగాం, ఆయన్ని విన్నాం, ఆయనతో ఉన్నాం, ఎన్నో మంచి విషయాలు పంచుకున్నాం..ఆయన జ్ఞాపకాలు మనల్ని మైమరపిస్తాయి. మేల్కొలుపుతాయి..ఓదారుస్తాయి కూడా'..అని ఆయన బాలూతో తన జ్ఞాపకాలను వివరించారు. ఆ మహనీయ మూర్తిని చిరకాలం జ్ఞాపకం ఉంచుకునేవిధంగా, వారి స్మారకాన్ని నిర్మిచడం ఎంతో సంతోషకరమన్నారు. అందుకు కృషిచేసిన నగర ప్రముఖులు, నగర వాసులు 'లాయర్' పత్రిక అధినేత శివప్రభాత్‌రెడ్డి, నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, రాష్ట్ర పురపాలక మంత్రి పొంగూరు నారాయణ, నెల్లూరు రూరల్ శాసనసభ్యులు కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, నగరపాలక సంస్థ అధికారులు అందరికీ ఆయన అభినందనలు తెలిపారు.

### బాలూ చిరస్మరణీయులు

**- ప్రముఖ సంగీతవేత్త కీరవాణి**

బాలూ గారి సంగీతం కన్నా, వారి వ్యక్తిత్వం నాకెంతో ఇష్టం. భాష, సంస్కారం, ప్రవర్తన, వినయం, ఆయన మంచితనానికి నిలువెత్తు నిదర్శనం. ఆయన తన మధురస్వరంతో వేలాదిపాటలు పాడారు. అవన్నీ ఆయన స్మారకాలే. ఆయన చిరస్మరణీయులు. బాలూ గారిని గుండెల్లో నిలుపుకున్న నెల్లూరీయులందరికీ ధన్యవాదాలు.

### చేస్తే..ఇలా చేయాలి

**- బాలూ తనయుడు ఎస్పీ చరణ్**

నెల్లూరులో నాన్నగారి విగ్రహస్థాపన ఇంత అద్భుతంగా జరగడం.. 'చేస్తే ఇలా చేయాలి' అనిపించేలా చేసిన నెల్లూరీయులకు, విగ్రహ స్థాపనకు కృషిచేసిన వారందరికీ ధన్యవాదాలు.



# అంతరిక్షమే నాలుగో యుద్ధరంగం

## ఆధునిక యుద్ధతంత్రాల్లో.. ఉపగ్రహాల పాత్రే కీలకం



- డీఆర్‌డీఓ మాజీ ఛైర్మెన్ డా.సతీష్‌రెడ్డి

రక్షణ రంగంలో అంతరిక్ష సాంకేతికతల ప్రాధాన్యత రోజురోజుకూ పెరుగుతోందని, ఇకపై అంతరిక్షమే నాలుగో యుద్ధరంగంగా మారనుందని, భవిష్యత్ సవాళ్లను ఎదుర్కొనేందుకు భారత్ వ్యూహాత్మకంగా సిద్ధం కావాలని రక్షణ పరిశోధన, అభివృద్ధి సంస్థ (డీఆర్‌డీఓ) మాజీ ఛైర్మెన్, జాతీయ భద్రతా మండలి సభ్యులు డాక్టర్ జి.సతీష్‌రెడ్డి చెప్పారు. ఇటీవల హైదరాబాద్‌లో నిర్వహించిన 'ది డే ది స్కై గోస్ డార్క్: వార్‌ఫేర్ ఇన్ ది ఏజ్ ఆఫ్ శాటిలైట్ డిపెన్‌డెన్స్' అనే అంశంపై జరిగిన సదస్సులో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా సతీష్‌రెడ్డి మాట్లాడుతూ, సంప్రదాయ యుద్ధరంగాలైన భూమి, సముద్రం, గగనతలం తర్వాత..అంతరిక్షం నాలుగో కోణంగా (ఫోర్త్ డైమన్షన్ ఆఫ్ వార్‌ఫేర్)గా అవతరించిందని పేర్కొన్నారు. ప్రస్తుతం ప్రపంచ వ్యాప్తంగా సైనిక రక్షణ వ్యవస్థలు కమ్యూనికేషన్, నావిగేషన్, మరియు నిఘా అవసరాల కోసం పూర్తిగా ఉపగ్రహాలపైనే ఆధారపడుతున్నాయని ఆయన గుర్తుచేశారు. ఉపగ్రహాలపై ఆధారపడటం ఎంత పెరిగిందో అంతే స్థాయిలో వాటికి ముప్పు కూడా పొంచి ఉందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఉపగ్రహాలను నిర్వీర్యం చేసే క్షిపణులు, ఇతర అంతరిక్ష వ్యతిరేక సాంకేతికతలను ప్రపంచ దేశాలు వేగంగా అభివృద్ధి చేస్తున్నాయన్నారు. యుద్ధ సమయంలో శత్రుదేశాలు ఉపగ్రహ సమాచారాన్ని నిలిపివేస్తే (బ్లాక్ చేస్తే) దేశ రక్షణ వ్యవస్థలు స్తంభించిపోయే ప్రమాదం ఉందని తెలిపారు. దేశ భద్రతా వ్యవస్థలు నిరంతరాయంగా ఎలా కొనసాగాలనే అంశాలపై వ్యూహాత్మక పరిశోధనలు జరగాలని ఆయన సూచించారు. భవిష్యత్తులో ఎదురయ్యే ఎలాంటి సవాళ్లనైనా ఎదుర్కొనేందుకు మనదేశం అడుగులు వేస్తోందన్నారు. ఇందులో భాగంగా, ఆధునిక యుద్ధాల్లో ఉపగ్రహాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని, శత్రుదేశాలు ఉపగ్రహాలను లక్ష్యంగా చేసుకునే పరిస్థితుల్లో కూడా కమ్యూనికేషన్, నావిగేషన్, నిఘా వ్యవస్థలు కొనసాగేందుకు అవసరమైన సాంకేతిక సామర్థ్యాలను భారత్ అభివృద్ధి చేస్తోందని ఆయన తెలిపారు. ఈ సదస్సులో మాజీ ఇస్రో ఛైర్మన్ ఎ.ఎస్.కిరణ్‌కుమార్, మాజీ వాయు సేనాధిపతి వివేక్ రాం చౌదరి, అనంత్ టెక్నాలజీస్ సీఎండీ సుబ్బారావు పావులూరి, టేక్ మీ 2 స్పేస్ వ్యవస్థాపకుడు రోనాక్ కుమార్ సమంత్రాయ్ పాల్గొన్నారు.

### ప్రకృతి సేద్యం..

# రైతులకు ఉపయోగం

ప్రకృతి సేద్యం ద్వారా రైతులు మరింత ప్రయోజనం పొందవచ్చని, తక్కువ ఖర్చుతో మంచి ఆదాయం ఉండే ఈ విధానాన్ని రైతులు అనుసరించాలని రైతు సాధికార సంస్థ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ కె.కన్నయ్య చెప్పారు. ఈనెల 1న నెల్లూరులోని తమ కార్యాలయంలో ఆయన ఫార్మర్ మాస్టర్ ట్రైనర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తక్కువ నీటితో సాగయ్యే పశుగ్రాస పంటలను ప్రోత్సహించాలన్నారు. గ్రామాల్లో పర్యటిస్తూ రైతుల సమస్యలు తెలుసుకుని పరిష్కరించాలని వ్యవసాయ సిబ్బందికి సూచించారు. ఈ ఏడాది ఎల్‌నినో కారణంగా వర్షాలు తక్కువగా కురిసే పరిస్థితులు ఏర్పడవచ్చని ఆయన అంటూ, భూసారాన్ని, నేలలో తేమను పరిరక్షించుకునేందుకు అనువైన పంటలను రైతులు సాగుచేసుకోవడం మంచిదని తెలిపారు. ప్రాంతీయ సాంకేతిక సమన్వయకర్త రవిచంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రాక్టికల్ పరీక్షలు వాయిదా

ఓపెన్‌స్కూల్ ఇంటర్ ప్రాక్టికల్స్ పరీక్షలు ఈనెల 2 నుంచి జరగాల్సి ఉండగా, థియరీ పరీక్షను ఈనెల 2వ తేదీకి మార్పుచేయడంతో, అదేరోజు నిర్వహించాల్సిన ప్రాక్టికల్స్ పరీక్షలు జూన్ 7వ తేదీకి వాయిదా పడ్డాయని జిల్లా విద్యాశాఖాధికారి బాలాజీరావు ఒక ప్రకటనలో తెలియజేశారు.

### స్వర్ణభారత్'లో 5న..

# అన్నమయ్య సంకీర్తనా విభావరి

భారత 13వ ఉప రాష్ట్రపతి, స్వర్ణభారత్ ట్రస్ట్ స్ఫూర్తిప్రదాత ముప్పవరపు వెంకయ్య నాయుడు సమక్షంలో జూన్ 5 శుక్రవారం సాయంత్రం 5.30 గంటలకు అన్నమయ్య సంకీర్తన సంగీత విభావరి జరుగుతుందని వెంకటాచలంలోని స్వర్ణభారత్ ట్రస్ట్ ట్రస్టీ దీపా వెంకట్ తెలిపారు. పద్మశ్రీ పురస్కారగ్రహీత.. ప్రముఖ ఆధ్యాత్మిక సంగీతవిద్వాంసులు.. అన్నమయ్య గానగంధర్వ గరిమెళ్ళ బాలకృష్ణప్రసాద్ తనయులు గరిమెళ్ళ అనిల్‌కుమార్ ఆధ్వర్యంలో అన్నమయ్య కీర్తనల స్వరార్చన నిర్వహిస్తామని ఆమె వివరించారు. సంగీతాభిమానులందరూ పాల్గొని వారి భక్తిభావ తరంగాలని అస్వాదించాలని ఆమె విజ్ఞప్తి చేశారు.

# నైతిక విలువలను పెంపొందించే.. బాలసాహిత్యం

--- ఆచార్య మాడభూషి సంపత్ కుమార్ ---



పుస్తకాలను ఆవిష్కరిస్తున్న ముఖ్యఅతిథులు

పిల్లల్లో నైతిక విలువలు పెంపొందించేది బాల సాహిత్యమేనని ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రం సంచాలకులు ఆచార్య మాడభూషి సంపత్‌కుమార్ అన్నారు. సోమవారం నెల్లూరు సమీపంలోని వెంకటాచలం మండలం సరస్వతినగర్‌లో ఉన్న ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రంలో ప్రముఖ బాలసాహిత్య రచయిత, కర్నూలు జిల్లా వాసి గద్వాల సోమన్న రచించిన గగన తారలు, బడిగంట అనే రెండు పుస్తకాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆచార్య మాడభూషి సంపత్‌కుమార్ మాట్లాడుతూ రచయిత గద్వాల సోమన్న ఇంజనీరింగ్ చదివి, గణిత ఉపాధ్యాయుడైనప్పటికీ బాల సాహిత్యంలో విశేషంగా కృషిచేసి 98 పుస్తకాలను రచించి ప్రచురించడం గొప్ప విషయమన్నారు. కేంద్ర బాల సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత గంగిశెట్టి శివకుమార్ మాట్లాడుతూ బాల సాహిత్యం, కథలు చిన్నారులకు నీతిని బోధిస్తాయని తెలిపారు. ప్రముఖ రచయిత్రి గోవిందరాజుల సుభద్రాదేవి బాలల కథల ప్రాధాన్యతను వివరించారు. రచయిత గద్వాల సోమన్న మాట్లాడుతూ చిన్నారులను అక్షరమే ఉన్నతంగా తీర్చిదిద్దుతుందని పేర్కొన్నారు. అనంతరం అతిధులను, పరిశోధకులను, విద్యార్థులను రచయిత ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రం విద్యాత్మక సిబ్బంది విద్యార్థులు పరిశోధకులు విశేషంగా పాల్గొన్నారు.



### జొన్నవాడ దేవస్థానంలో..

# వేడుకగా 16 రోజుల పండుగ



బుచ్చిరెడ్డిపాలెం మండలం, జొన్నవాడలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన శ్రీ మల్లికార్జున స్వామి కామాక్షితాయి దేవస్థానంలో వార్షిక బ్రహ్మోత్సవాల అనంతరం నిర్వహిస్తున్న 16వ రోజు పండుగ ఉత్సవాలు ఇటీవల అత్యంత వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా శ్రీ మల్లికార్జున స్వామివారు, శ్రీ కామాక్షితాయి అమ్మవార్ల దివ్య కళ్యాణ మహోత్సవం శాస్త్రోక్తంగా నిర్వహించారు. హైదరాబాద్ వాస్తవ్యులు బండి నరసారెడ్డి–శైలజమ్మ ఈ వేడుకలకు ఉభయకర్తలుగా వ్యవహరించారు. కళ్యాణోత్సవం అనంతరం స్వామి అమ్మవార్లకు మహామంగళహారతి నిర్వహించి, భక్తులకు తీర్థప్రసాదాలు, అన్నప్రసాదాలు పంపిణీ చేశారు. సాయంత్రం నృత్య ప్రదర్శనలు భక్తులను ఆకట్టుకోగా, రాత్రి జరిగిన పల్లకిసేవలో స్వామిఅమ్మవార్లు ఆలయ ప్రాకారాలలో విహరించి భక్తులను కటాక్షించారు. అనంతరం నిర్వహించిన వీణా కచ్చేరి, చివరిగా ఏకాంత సేవతో 16వ రోజు పండుగ కార్యక్రమాలు ముగిశాయి. దేవస్థానం ఛైర్మెన్ తిరుమూరు అశోక్‌రెడ్డి, దేవస్థాన సహాయ కమిషనర్ మరియు కార్యనిర్వహణ అధికారి అర్వభూమి వెంకట శ్రీనివాసులురెడ్డి, పాలక మండలి సభ్యులు పాల్గొని పర్యవేక్షించారు.

# జాతీయ అవార్డు సాధించిన గురుకుల పాఠశాల



అవార్డునందుకుంటున్న ప్రిన్సిపల్ వసుధ

పొగాకు రహిత విద్యాసంస్థగా జాతీయస్థాయిలో అవార్డు సాధించిన బుచ్చిరెడ్డిపాళెంలోని డా. బీఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాల నిర్వాహకులను నెల్లూరులోని జిల్లా అధికారులు అభినందించారు. పొగాకు వల్ల కలిగే దుష్ప్రభావాలను ప్రజలకు తెలియజేయడంలో వారి కృషికి జాతీయ అవార్డు లభించడం, ఢిల్లీలో కేంద్ర విద్యాశాఖ మంత్రి సంజయ్‌కుమార్ చేతులమీదుగా అవార్డును అందుకోవడం హర్షదాయకమని జిల్లా వైద్యశాఖ అధికారిణి డీసీఓ డాక్టర్ సి.ప్రభావతి ఈ సందర్భంగా అవార్డును అందుకున్న గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ ఎం.వసుధను ప్రశంసించారు.

# శ్రీసిటీలో.. ఉల్లాసంగా వేసవి శిబిరం

## విజ్ఞానంతో పాటు వినోదాన్నీ పొందామన్న విద్యార్థులు



ముగింపు వేడుకలో మాట్లాడుతున్న నిరీషా సన్నారెడ్డి, రంజిత

శ్రీసిటీలో ఇటీవల నిర్వహించిన వేసవి శిబిరం ఎంతో తమకు విజ్ఞానం, వివిధ అంశాలలో నైపుణ్య శిక్షణతో పాటు వినోదం, ఆహ్లాదాన్ని పంచిందంటూ విద్యార్థులు సంతోషపడ్డారు. గత నెల27న ఇరుగుళం జడ్పీ హైస్కూల్‌లో ప్రారంభమైన వేసవి శిబిరం ఇటీవల ముగిసింది. అకార్డ్ స్కూల్ సమావేశ మందిరంలో ముగింపు వేడుక నిర్వహించారు. ఈ సందర్భంగా వేసవి శిబిరం పట్ల విద్యార్థులు తమ అభిప్రాయాలను, మధురానుభూతులను పంచుకున్నారు. తమ ప్రాంతంలో గతంలో ఇలాంటివి అందు బాటులో లేవని, ఉచిత భోజన, వాహన వసతితో పాటు చక్కని శిబిరం ఏర్పాటు చేసిన శ్రీసిటీ యాజమాన్యానికి వారంతా కృతజ్ఞతలు తెలిపారు. ఏప్రిల్ 27 నుంచి మే 29 వరకు జరిగిన ఈ వేసవి శిబిరంలో 8,9, 10వ తరగతుల పరీక్షలు పూర్తయిన విద్యార్థులు 68 మంది హాజరు కాగా, 50 మంది చివరివరకు పాల్గొన్నారు. శిక్షణలో అనేక అంశాలను వివరించారు. తిరుపతిలోని జంతు సంరక్షణ కేంద్రం, సైన్స్ సెంటర్, ఇస్కాన్ ఆలయం క్షేత్ర పర్యటనలు మరియు శ్రీసిటీలోని పెప్సీ, వైటల్ పేపర్స్ పరిశ్రమలు, నర్సరీ సందర్శనలకు తీసుకెళ్లారు. స్థానిక అపోలో హెల్త్ కేర్ సెంటర్, శంకర నేత్రాలయ, కేర్ డెంటల్ వారిచే జనరల్ హెల్త్, నేత్ర, పంటి వైద్య శిబిరాలను నిర్వహించి విద్యార్థులకు పరీక్షలు చేశారు. శ్రీసిటీ డైరెక్టర్(సీఎస్ఆర్) నిరీషా సన్నారెడ్డి వివిధ కోర్సులతో ఈ కార్యక్రమాన్ని రూపొందించి మార్గనిర్దేశం చేశారు. అధ్యాపకులు రంజిత (క్రాఫ్ట్), దుష్యంత్ (పోటీ పరీక్షలు), సౌమ్య మరియు సాయిలక్ష్మి (ఇంగ్లీష్), చెంచయ్య (కంప్యూటర్స్, మ్యాథ్స్), కోదండం (యోగా), మురళి (క్రీడలు) వేసవి శిబిరం శిక్షకులుగా వ్యవహరించారు. ముగింపు వేడుకలలో క్రీడా పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులందించారు. రంజిత రమేష్ కుమార్ అతిథిగా పాల్గొన్నారు. శ్రీసిటీలోని మాండెలెజ్ పరిశ్రమవారు విద్యార్థులకు క్యాడ్బరీ చాక్లెట్లను పంచిపెట్టారు. శ్రీసిటీ ఫౌండేషన్ సిబ్బంది పాల్గొన్నారు.







# గూడూరు డివిజన్

## మంచి కమిషనర్ రిటైర్ అయ్యారు

### ఎమ్మెల్యే పాశిం సునీల్



వెంకటేశ్వర్లు దంపతులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్

మంచి కమిషనర్ రిటైర్ అవుతున్నందుకు చాలా బాధగా ఉందని, ఆయన శేష జీవితం ఆయురారోగ్యాలతో ఉండాలని గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ కోరారు. గూడూరు పోటుపాలెం రోడ్డులోని ఓ ప్రైవేటు ఫంక్షన్‌హాల్‌లో ఇటీవల మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు పదవీ విరమణ సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. కమిషనర్ వెంకటేశ్వర్లు దంపతులను ఎమ్మెల్యే సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు. అలాగే పలువురు టిడిపి నాయకులు, మాజీ కౌన్సిలర్లు, పలు రాజకీయ పార్టీల వారు, పురపాలక సంఘ సిబ్బంది, ప్రజలు కమిషనర్‌ని సన్మానించి అభినందనలు తెలియజేశారు. ఎమ్మెల్యే సునీల్‌కుమార్ మాట్లాడుతూ మున్సిపల్ కమిషనర్‌గా వెంకటేశ్వర్లు నిజాయితీగా విశేష సేవలు అందించారని, ప్రజలు ఏ సమయంలో ఫోన్‌చేసి సమస్య తెలియజేసినా వెంటనే దాన్ని పరిష్కరించే వారని తెలిపారు. పట్టణంలో సెంట్రల్ లైటింగ్ ఏర్పాటుకు కమిషనర్, టిడిపి సీనియర్ నాయకులు కిరణ్‌కుమార్ ఎంతో కృషి చేశారని గుర్తు చేశారు. కమిషనర్ రిటైర్ అయినా ఆయన సలహాలు సూచనలు అందించి గూడూరు పట్టణాభివృద్ధికి సహకరించాలని కోరారు. నాయకులు తానంకి నానాజీ, ఎల్లసిరి గోపాల్‌రెడ్డి, కిరణ్‌కుమార్, పులిమి శ్రీనివాసులు, బిల్లు చెంచురామయ్య, రహీం, మస్తాన్‌నాయుడు, శివకుమార్, చంద్రమౌళి, శ్రావణి తదితరులు పాల్గొన్నారు.



## ఇన్‌ఛార్జి కమిషనర్‌గా సోమశేఖర్

గూడూరు పురపాలక సంఘం ఇన్‌ఛార్జి కమిషనర్‌గా సోమశేఖర్ బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న వెంకటేశ్వర్లు పదవీ విరమణ చేయడంతో మేనేజర్‌గా విధులు నిర్వహిస్తున్న ఆయన్ను ఇన్‌ఛార్జి కమిషనర్‌గా నియమిస్తూ ఉత్తర్వులిచ్చారు. 1వ తేదీ ఆయన సిబ్బందితో సమావేశమై పారిశుద్ధ్య చర్యలు సత్వరం చేపట్టాలని సూచించారు.

## ఉత్తమ పౌరులను అందించడమే లక్ష్యం

### శ్రీ చంద్రశేఖరేంద్ర సరస్వతి విశ్వ మహా విద్యాలయం యూనివర్సిటీ వైస్‌ఛాన్సలర్ ప్రొఫెసర్ జి.శ్రీనివాస్



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న ముఖ్యఅతిథులు



సత్కారాన్నందుకుంటున్న ఏ.శివకుమార్

మంచి ఉన్నత విద్యను అందించి దేశానికి ఉత్తమ పౌరులను అందించడమే లక్ష్యంగా కాంచీపురం శ్రీ చంద్రశేఖరేంద్ర సరస్వతి విశ్వ మహా విద్యాలయం యూనివర్సిటీ స్థాపించడం జరిగిందని యూనివర్సిటీ వైస్‌ఛాన్సలర్ ప్రొఫెసర్ జి.శ్రీనివాస్ వెల్లడించారు. గూడూరు రెండో పట్టణ పరిధిలోని బ్రాహ్మణ సేవాసంఘం కళ్యాణ మండపంలో ఇటీవల యూనివర్సిటీ స్పాట్ అడ్మిషన్ల కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన వైస్ ఛాన్సలర్ శ్రీనివాస్ మాట్లాడుతూ కంచి కామకోటి పీఠం జగద్గురు శ్రీ శంకరాచార్య స్వాముల వారి మార్గదర్శకంతో యువతకు క్రమ శిక్షణ, విలువలతో కూడిన విద్యను అందించాలనే లక్ష్యంతో యూనివర్సిటీ స్థాపించామని తెలిపారు. అలాగే పేద విద్యార్థులకు ఫీజు రాయితీ ఇస్తున్నామని అందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. బ్రాహ్మణ సంఘ అధ్యక్షులు ఆనిమెళ్ళ శివకుమార్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత విద్యార్థులకు కూడా విలువలతో కూడిన విద్యను అందించాలనే లక్ష్యంతో యూనివర్సిటీ స్థాపించడమే కాకుండా పేద విద్యార్థులకు ఫీజు రాయితీ ఇవ్వడం ఎంతో అభినందనీయమన్నారు. డీన్ వెంకటరమణ, సురేంద్ర మైథిలి, బ్రాహ్మణ సంఘ సభ్యులు లలితమ్మ, పురుషోత్తం, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

## వెంబలూరు రైతులకు అండగా ఉంటా!

### • వైసీపీ నేత నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి



బాధిత రైతులను పరామర్శిస్తున్న నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

వెంకటగిరి నియోజకవర్గం వెంబలూరు గ్రామంలో పట్టా భూమిలో సాగు చేస్తున్న నిమ్మ చెట్ల తొలగింపు ఘటనను ఇటీవల వెంకటగిరి నియోజకవర్గ వైఎస్సార్సీపీ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి పరిశీలించారు. సంఘటన స్థలాన్ని పరిశీలించిన ఆయన బాధిత రైతులు పూల వెంకటేశ్వర్లు, పూల కిష్టయ్య కుటుంబ సభ్యులను పరామర్శించి పూర్తి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా నేదురుమల్లి మాట్లాడుతూ, రైతులకు ముందస్తు నోటీసులు ఇవ్వకుండా, చట్టబద్ధమైన ప్రక్రియను పాటించకుండా రాత్రి వేళ పోలీసు బందోబస్తుతో భూముల్లోకి ప్రవేశించి చెట్లను తొలగించడం అత్యంత బాధాకరమని అన్నారు. ప్రజల ఆస్తులు, హక్కులను కాపాడాల్సిన అధికారులు భయాందోళనలు సృష్టించే విధంగా వ్యవహరించడం సమంజసం కాదన్నారు. అధికారుల ఏకపక్ష చర్యలు సహించేది లేదని, బాధితులకు న్యాయం జరిగే వరకు పోరాడుతామని చెప్పారు. రైతుల పక్షాన వైఎస్సార్సీపీ ఎల్లప్పుడూ నిలబడుతుందని ఆయన స్పష్టం చేశారు. వెంబలూరు ఘటనపై జిల్లా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయడంతో పాటు, బాధితులకు న్యాయం జరిగే వరకు అన్ని విధాలుగా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. అవసరమైతే న్యాయపోరాటం చేపడతామన్నారు.



## భవిష్యత్తు యంత్రాలది కాదు..

# వాటిని నడిపించే మనుషులది!

నేటి విద్యా ప్రపంచంలో ఒక అపోహ బలంగా పెరిగింది. STEM చదివితేనే భవిష్యత్తు, మిగతావన్నీ "సెకండరీ". మానవికలు, సామాజికశాస్త్రాలు (Humanities & Social Sciences) కూడా అలాంటివే. అవి కళ్లకు కనిపించకపోయినా, మనిషి ఆలోచన, విలువలు, ప్రవర్తన, సమాజం..ఇవన్నీ మలిచే అంతర్గత శక్తులు. ఒక ఇంజనీరు వంతెన కడతాడు; కానీ ఆ వంతెన ఎవరిని కలుపుతుంది, ఎవరిని దూరం చేస్తుంది, దానివల్ల సమాజంలో ఏ మార్పులు వస్తాయి. ఇవి అర్థంచేసేది మానవికలే. మనిషి చేతిలోఉన్న పరికరం ఎంత శక్తివంతమైనదైనా, దాన్ని ఎలా ఉపయోగించాలో చెప్పేది వారి విలువలే అన్న సత్యాన్ని మరచిపోవద్దు. మన పురాణాల్లో ఒక సూక్తి ఉంది: "విద్యా దదాతి వినయం". ఈ వినయం, ఈ విలువలు, ఈ మనసు.. ఇవి STEM పుస్తకాలలో దొరకవు; ఇవి మానవికలే నేర్పుతాయి. సాహిత్యం చదివిన విద్యార్థి ఒక కథలోని పాత్రను చూసి తనలోని భావాలను అర్థం చేసుకుంటాడు. చరిత్ర చదివిన విద్యార్థి ఒక సామ్రాజ్యం ఎందుకు ఎదిగింది, ఎందుకు కూలింది అన్నదానిలో మనుషుల ప్రవర్తనను గమనిస్తాడు. తత్వశాస్త్రం చదివినవాడు "నేను ఎందుకు ఇలా ఆలోచిస్తున్నాను?" అని తనను తాను ప్రశ్నిస్తాడు. ఈ ప్రశ్నించే శక్తి లేకుండా శాస్త్రం కూడా ముందుకు సాగదు. అందుకే వేమన అన్నాడు: "మనసే మనిషికి మిత్రుడు, శత్రువూ అదే." మనసును అర్థం చేసుకునే శాస్త్రాలే మానవికలు. మనసు లోతులను అర్థం చేసుకున్నవాడే నిజమైన నాయకుడు అవుతాడు, ఎందుకంటే నాయకత్వం అంటే కేవలం ఆదేశాలు కాదు, హృదయాలను గెలుచుకోవడం.

ఒక వైద్యుడిని ఊహించండి. ఆయన వ్యాధిని నయం చేయగలడు. కానీ రోగి భయాన్ని తగ్గించడం, ధైర్యం చెప్పడం, ఆయన కుటుంబంతో మాట్లాడే సున్నితత్వం.. ఇవి మానవికలే నేర్పుతాయి. ప్రపంచంలోని ప్రముఖ మెడికల్ కళాశాలలు "Medical Humanities" అనే కోర్సులను తప్పనిసరి చేయడం యాదృచ్ఛికం కాదు. సామాజిక శాస్త్రాలు కూడా అంతే శక్తివంతమైనవి. సమాజం ఎలా పనిచేస్తుంది? మనుషులు ఎందుకు ఒక విధంగా ప్రవర్తిస్తారు? ఆర్థిక వ్యవస్థ ఎందుకు మార్పు చెందుతుంది? రాజకీయాలు ఎందుకు ఊగిసలాడుతాయి?.. ఈ ప్రశ్నలకు సమాధానాలు STEMలో లేవు. ఒక టెక్నాలజీ అద్భుతంగా పని చేయవచ్చు; కానీ అది సమాజంలో అసమానతను పెంచుతుందా-తగ్గిస్తుందా అన్నది సామాజిక శాస్త్రాలే చెబుతాయి. అందుకే నేటి పెద్ద కంపెనీలు Google, Microsoft, Meta..ఇవన్నీ సైకాలజీ, సోషియాలజీ, ఆంథ్రపాలజీ చదివిన వారిని పెద్ద సంఖ్యలో నియమిస్తున్నాయి. టెక్నాలజీని ఉపయోగించేది మనిషే; అతని మనసు, ప్రవర్తన, సంస్కృతి..ఇవి అర్థం కాకపోతే టెక్నాలజీకి అర్థంఉండదు. "మనసుమారితే ప్రపంచం మారుతుంది" అన్న లోకోక్తికి ఇదో ఉదాహరణ.

జ్ఞాన నేత్రం
డా. నరసింహారెడ్డి ఊరిమిండి
Dallas, Texas, USA

ఈ మనసు మార్పు, దృక్పథం మార్పు.. ఇవి మానవికలు, సామాజిక శాస్త్రాలే తెస్తాయి. సమాజం ఒక జీవి లాంటిది; దాని స్పందనలను అర్థం చేసుకోగలిగిన వారే నిజమైన మార్పు దారులు. ఏఐ, రోబోటిక్స్, డేటాసైన్స్... ఇవి నేటి ప్రపంచాన్ని నడిపిస్తున్నాయి. కానీ AIకి నైతికత ఎవరు నేర్పాలి? రోబోటిక్స్‌కు బాధ్యత ఎవరు నేర్పాలి? డేటా సైన్స్‌కు సమానత్వం ఎవరు నేర్పాలి? STEM ఈ ప్రశ్నలకు సమాధానం ఇవ్వదు. ఒక AI Hiring System మహిళలను పక్కన పెట్టినప్పుడు, సమస్య అల్గారిథమ్‌లో కాదు; సమస్య ఆ అల్గారిథమ్‌ను రూపొందించినవారి సామాజిక అవగాహనలో ఉంది. అందుకే నేటి ప్రపంచం "AI Ethics", "Tech Policy", "Digital Sociology" వంటి రంగాల వైపు పరుగులు తీస్తోంది. మన శాస్త్రవేత్తలే చెబుతారు: "Technology makes things possible,Humanities make things meaningful." అంటే టెక్నాలజీ అవకాశాలు ఇస్తుంది; కానీ ఆ అవకాశాలకు అర్థం ఇచ్చేది మానవికలే. అర్థం లేని శక్తి ప్రమాదకరం; దిశ లేని వేగం వ్యర్థం. ఈ రెండింటికీ దిక్సూచి మానవికలే. చరిత్రలోని మహానుభావులను చూస్తే కూడా ఇదే స్పష్టమవుతుంది. గాంధీ న్యాయశాస్త్రం చదివారు; కానీ ఆయనను మహానుభావుడిని చేసినది.. తత్వశాస్త్రం, చరిత్ర, నైతికత, సాహిత్యం. అబ్దుల్‌కలాం ఓ గొప్ప శాస్త్రవేత్త; కానీ వారి ప్రసంగాలు, వారి విలువలు, వారి దృక్పథం-ఇవి మానవికలే ఇచ్చిన బలం. నేటి స్టార్టప్ వ్యవస్థాపకుల్లో చాలామంది సైకాలజీ, ఫిలాసఫీ, హిస్టరీ చదివినవారే. ఎందుకంటే వ్యాపారం అంటే కేవలం ఉత్పత్తి కాదు; అది మనుషుల సమస్యలను అర్థం చేసుకుని పరిష్కరించడం. కేవలం "STEM చదివితేనే భవిష్యత్తు ఉంది" అని అనుకోవడం సరికాదు. ప్రపంచం మారుతోంది. భవిష్యత్తు ఉద్యోగాలు..ఏఐ ఎథిక్స్ స్పెషలిస్ట్, బిహేవియరల్ ఎకనామిస్ట్, యూఎక్స్ రీసెర్చర్, పాలసీ అనలిస్ట్, కల్చరల్ స్ట్రాటజిస్ట్, సోషియల్ డేటా సైంటిస్ట్.. ఇవన్నీ మానవికలు-సామాజికశాస్త్రాల మీదే ఆధారపడుతున్నాయి. మనసును, విలువలను, సమాజాన్ని అర్థంచేసుకునే విద్య. అదే మానవికలు. భవిష్యత్తు యంత్రాలది కాదు; యంత్రాలను నడిపించే మనుషులది. అందుకే మనుషుల మనసును తీర్చిదిద్దే విద్య మరింత ముఖ్యమవుతోంది. విద్య అంటే కేవలం ఉద్యోగం కాదు; అది మనిషిని మలిచే ప్రక్రియ. STEM మనిషి చేతిలో శక్తిని పెంచుతుంది; మానవికలు ఆ శక్తిని సరైన దిశలో వినియోగించే జ్ఞానం ఇస్తాయి. STEM బలం ఇస్తుంది; మానవికలు దారి చూపుతాయి. మనిషి సంపూర్ణతకు రెండు రెక్కలు అవసరం. ఒకటి శాస్త్రం, మరొకటి మానవికలు; ఒకటి లేకపోతే ఎగరడం అసాధ్యం. అందుకే ఈ వ్యాసం శీర్షికలో చెప్పినట్లే..ఇవి రెండో స్థానంలోవి కావు. ఇవే మనిషిని మలిచే మహాశక్తులు.



**వచ్చే వారం :** వాణిజ్య-వ్యాపార రంగం.. CA, MBAలకే పరిమితం కాని భవిష్యత్తు మార్గాల గురించి.

E-mail: reddyu@gmail.com

---

# ఇచ్చిన మాట ప్రకారం.. పనులు చేయిస్తున్నాం

- టీడీపీ అధికార ప్రతినిధి కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి



అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి

నెల్లూరు రూరల్ నియోజకవర్గ ప్రజల అభ్యున్నతికోసం, వారికిచ్చిన మాట మేరకు అభివృద్ధి పనులను వేగంగా చేయిస్తున్నామని టీడీపీ రాష్ట్ర అధికారప్రతినిధి కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి చెప్పారు. 17కోట్ల రూపాయల వ్యయంతో చేపట్టిన 168 అభివృద్ధి పనులను ఇటీవల ఆయన పరిశీలించారు. 22వ డివిజన్‌లో జరుగుతున్న పనులను క్షేత్రస్థాయిలో కూటమి నాయకులతో కలిసి పర్యవేక్షించారు. చెప్పిన మాట ప్రకారం 168 అభివృద్ధి పనులను 60 రోజుల్లో పూర్తిచేసి ప్రజలకు అందిస్తామని, ఆమేరకు నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ఎప్పటికప్పుడు అధికారులతో సమీక్షిస్తూ, పనుల పురోగతికి తగు సూచనలందిస్తున్నారని ఆయన తెలిపారు. నెల్లూరు రూరల్ అభివృద్ధికి సహకరిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకి, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, యువనేత నారా లోకేష్‌లకు ఆయన ఈ సందర్భంగా ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట క్లస్టర్ ఇన్‌చార్జ్ సాయిబాబా, కో-క్లస్టర్ ఇన్‌చార్జ్ కోటిరెడ్డి, కార్పొరేటర్ మూలే విజయభాస్కర్‌రెడ్డి, 22వ డివిజన్ టీడీపీ అధ్యక్షులు యానాదిరెడ్డి, బీజేపీ నాయకులు రాజేష్, టీడీపీ నాయకులు యోగానందం, పరంధామయ్య పాల్గొన్నారు.

## ప్రజల కోసం ఉద్యమించేదే సీఐటీయు

### ఆవిర్భావ దినోత్సవంలో నాయకులు

ప్రజల సమస్యలు తీర్చేందుకు నిరంతరం ఉద్యమించేదే సీఐటీయు అని, ఆ యూనియన్ నాయకులు చెప్పారు. ఇటీవల సీఐటీయు 56వ ఆవిర్భావ దినోత్సవాన్ని నెల్లూరులోని పలుప్రాంతాల్లో నిర్వహించారు. నగరంలోని ఏసీ కూరగాయల మార్కెట్, అయ్యప్పగుడి సెంటర్, రామకోటయ్యనగర్, బీవీనగర్, డీఎస్ఆర్ ఆసుపత్రి తదితర ప్రాంతాల్లో జెండాలు ఆవిష్కరించారు. చిన్నబజారులోని పండ్ల మార్కెట్‌లో సీఐటీయు నగర కార్యదర్శి జి.నాగేశ్వరరావు ఆధ్వర్యంలో జెండా ఎగురవేశారు. కేంద్రం కార్మికుల హక్కులను కాలరాస్తోందని, కార్పొరేట్ సంస్థలకు, యజమానులకు అనుకూలంగా వ్యవహరిస్తూ, కష్టపడి పనిచేసే కార్మికులకు కొత్త లేబర్ కోడ్‌లతో అన్యాయం చేస్తుందని ఆయన దుయ్యబట్టారు. కార్మిక నాయకులు కత్తి శ్రీనివాసులు, రాంబాబు, సూర్యనారాయణ, శ్రీనివాసులు, బసవయ్య, పండ్ల మార్కెట్ వర్కర్స్ యూనియన్ నాయకులు బసవయ్య, జె.శ్రీనివాసులు పాల్గొన్నారు.

# కండలేరు మట్టికట్ట దెబ్బతింటోంది!

## వెంటనే బాగుచేయాలని బీజేపీ నేత మిడతల డిమాండ్



కండలేరు డ్యాం బాగుకై వినతిపత్రం సమర్పిస్తున్న మిడతల రమేష్

కండలేరు డ్యామ్ డీప్ కోర్స్ వద్ద కృంగిన మట్టి కట్టను సరిచేసి, ఆ కట్ట ఎత్తును పెంచాలని, జలాశయం లోపలి భాగంలో వెంటనే రివిట్మెంట్ నిర్మించాలని బీజేపీ 'నమామి గంగే' రాష్ట్ర కన్వీనర్ మిడతల రమేష్ డిమాండ్ చేశారు. కండలేరు డ్యామ్ మట్టి కట్ట 8-10 కిలోమీటర్ల మధ్య జలాశయం అడుగు భాగంలో రివిట్మెంట్ లేనందున క్లే బ్లాంకెట్ కోసుకుపోతోందని, ఈ అత్యవసర పనులను ప్రభుత్వం విస్మరించడం విచారకరమని ఆయన అన్నారు. ఇటీవల ఆయన కండలేరు డ్యామ్‌ను సందర్శించి, అక్కడ పరిస్థితులను పరిశీలించారు. డీప్ కోర్స్ వద్ద డ్యామ్ 89 మీటర్ల ఎత్తు నిర్మాణం జరగలేదని, ఇప్పుడు ఎత్తు పెంచుతున్నామని తెలుగు గంగ ఎస్ఈ చెప్తున్నారని, 2011లో 1.2 మీటర్లు మట్టి కట్ట కృంగిపోవడంపై తాము నేషనల్ డ్యామ్ సేఫ్టీ సెల్‌కు ఫిర్యాదు చేశామని కూడా ఆయన తెలిపారు. డ్యామ్‌ను బాగుచేసి, యథార్థ స్థితికి తెచ్చేందుకు నిధులు లేవని చెప్పడం నిర్లక్ష్యం కాదా అని ఆయన ప్రశ్నించారు. 68 టీఎంసీల నీటినిల్వ ఉన్న ఈ జలాశయంలో పెద్దపెద్ద అలలకు రివిట్మెంట్ తట్టుకోలేదని, జలాశయం డీప్ కోర్స్ భాగంలో మెటల్ ఫిల్టర్ శాండ్ ఫిల్టర్ దెబ్బతిన్నాయని, క్లే బ్లాంకెట్ సైతం కోతకు గురవుతోందని ఆయన చెప్పారు. బీజేపీ నాయకులు ఎన్.రాజేశ్వరి, పొట్లూరు శ్రీనివాసులు, సృజన, ఆదినారాయణ, పద్మావతి, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

# స్థానిక ఎన్నికలకు సిద్ధం కండి

- కార్యకర్తలకు బీజేపీ పిలుపు

స్థానిక సంస్థల నేపథ్యంలో, పార్టీ కార్యకర్తలు- నాయకులందరూ గ్రామస్థాయిలో పార్టీని బలోపేతం చేసుకుని, ఎన్నికలకు సిద్ధం కావాలని బీజేపీ జిల్లా అధ్యక్షులు వంశీధర్‌రెడ్డి పిలుపునిచ్చారు. వెంకటాచలంలోని బీజేపీ కార్యాలయంలో ఈనెల 2న జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, గ్రామాల్లో పర్యటించి ప్రజల సమస్యలు తెలుసుకుని, వాటిని జిల్లా అధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించేందుకు కృషిచేయాలని పార్టీ శ్రేణులకు సూచించారు. మండల బీజేపీ నాయకులు ఏ.శ్రీనివాసులు, జిల్లా నాయకులు కుంచె శ్రీనివాసులు, ప్రసాద్ నాయుడు, వేణురెడ్డి, నరేశ్ పాల్గొన్నారు.

# ప్రమోషన్లు ఇవ్వండి మహాప్రభో!

**డిప్యూటీ హెచ్ఇఓల విజ్ఞాపన**

వైద్యశాఖలో పనిచేస్తూ, ఏళ్లు గడిచిపోతున్నా తాము ఎలాంటి ప్రమోషన్లు లేకుండానే ఉద్యోగ విరమణలు చేస్తున్నామని, పలువురు డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ అధికారులు వాపోయారు. ఇటీవల నెల్లూరు హరనాథపురంలో అసోసియేషన్ రాష్ట్ర కార్యవర్గ సమావేశం జరిగింది. రాష్ట్ర నాయకులు వెంకటరమణ, చేజర్ల సుధాకర్ రావు మాట్లాడుతూ, ఎంతోకాలంగా ప్రమోషన్లు లేకుండానే అనేకమంది అధికారులు వైద్యశాఖలో పనిచేస్తున్నారని, మే నెలలో కూడా అనేకమంది అలాగే రిటైరైపోయారని డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్స్ అసోసియేషన్ నాయకులు విచారం వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఇకనైనా డిప్యూటీ హెచ్ఇఓలకు ఉద్యోగోన్నతులు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఉద్యోగ విరమణ పొందుతున్న డిప్యూటీ హెచ్ఇఓ అనూరాధ (ప్రకాశం జిల్లా పంగులూరు పీహెచ్‌సీ)ని అసోసియేషన్ నాయకుల సన్మానించారు. అసోసియేషన్ రాష్ట్ర గౌరవాధ్యక్షురాలు సరోజిని, నాయకులు హరిప్రసాద్, శ్రీనివాసరావు, విజయభాస్కర్, మీనాకుమారి, అంజమ్మ, భ్రమరాంబ, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# జగన్ తొందరపడుతున్నాడా?

**ఏది చేయకూడదో అదే చేయడం, ఏది ప్రస్తావించకూడదో అదే మాట్లాడడం, ఎక్కడ దొరక్కూడదో అక్కడే దొరికిపోవడం కొందరికి అలవాటు. మన రాష్ట్రంలో ఈ కోవలోకి వచ్చే నాయకుల్లో మొదటి వరసలో ఉండే నేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి.**

నిత్యం కేసులు.. కోర్టులు.. జైళ్లు.. బెయిళ్లు.. దాడులు.. దౌర్జన్యాలు.. మోసాలు.. తిట్ల దండకాలతో సహవాసం చేసే వైఎస్సార్‌సీపీ అధినేత.. ఇతరులను నేర చరితులుగా చూపే క్రమంలో సెల్ఫ్ గోల్ వేసుకుంటున్నారనే వ్యాఖ్యలు ప్రస్తుతం రాష్ట్ర రాజకీయవర్గాల్లో జోరందుకున్నాయి. ఇటీవల ఆయన ప్రెస్‌మీట్‌పెట్టి తన తాత.. తండ్రి.. బాబాయ్ హత్యలను ప్రస్తావించి నిద్రాణమై ఉన్న వివాదాలను తట్టిలేపారని, లేని విమర్శలను మూటగట్టుకున్నారనే ప్రచారం సాగుతోంది. ముఖ్యంగా హత్యా రాజకీయలపై మాట్లాడి సానుభూతి పొందే క్రమంలో అడ్డంగా ప్రజల ముందు బుక్కైపోయారంటూ విశ్లేషకులు సైతం వ్యాఖ్యానిస్తున్నారు.

స్మృతి – విస్మృతి ఈపదాలకు అర్థం గుర్తుంచుకోవడం, పూర్తిగా మరిచిపోవడం. అంటే మనకు నచ్చే, మంచిచేసే అంశాన్ని తరచూ గుర్తు చేసుకోవడం స్మృతి. మనకు నచ్చని, ముప్పు తెచ్చే అంశాన్ని మనస్సులోకి కూడా రానివ్వకుండా అణిచివేయడం విస్మృతి. సాధారణ జీవితానికే కాదు, నిరంతర యుద్ధాన్ని తలపించే రాజకీయ రంగంలోనూ వీటికి ఎంతో ప్రాధాన్యం ఉంది. నాయకత్వ లక్షణాలు, రాజ్యం, పరిపాలనా సూత్రాలను వివరించే కౌటిల్యుడి అర్థం శాస్త్రంలోనూ నాయకుడికి ఉండాల్సిన ప్రధాన గుణం, ఏ విషయాన్ని ఎక్కడ ఎందుకు ఎప్పుడు ఎలా ప్రస్తావించాలో తెలుసుకోవడమే. కానీ, ఐదేళ్ల ప్రతిపక్ష నాయకుడిగా ఐదేళ్లు ముఖ్యమంత్రిగా పనిచేసిన జగన్‌మోహన్‌రెడ్డికి ఈ విషయంపై కనీస పరిజ్ఞానం కూడా లేనట్లు కనిపిస్తోంది. ఎందుకంటే రాయలసీమలో ఆమాటకొస్తే రాష్ట్రంలోనే ఫ్యాక్షన్ రాజకీయాల ప్రస్తావన వస్తే ముందుగా గుర్తొచ్చేది ఎవరో ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. అలాంటి పరిస్థితుల్లో వైఎస్ వివేకానందరెడ్డి హత్య తర్వాత వైఎస్సార్‌సీపీని ఏకంగా గొడ్డలి పార్టీ అంటూ తెలుగుదేశం నాయకులు నిత్యం జనం ముందు చులకన చేస్తున్నారు. ఈ నేపథ్యంలో జగన్ కానీ ఆ పార్టీ నాయకులు కానీ.. రాష్ట్రంలో హత్యారాజకీయాలు గన్‌కల్చర్, దౌర్జన్యాలు, దుర్మార్గాలు వంటి అంశాలను ప్రస్తావించకపోవడమే మంచిది. కానీ, శత్రువుకు తనంతట తానే ఆయుధం అందించినట్లుగా ఫ్యాక్షన్ పాలిటిక్స్, గొడ్డలి వేటు హత్యలు, దౌర్జన్యాలు, వేటకొడవళ్లు అంటూ ఏకంగా ప్రెస్‌మీట్ పెట్టి మరీ జగన్ సున్నితమైన అంశాలను ప్రస్తావించడం విశ్లేషకులను సైతం ఆశ్చర్యానికి గురిచేస్తోందన్న మాట విశ్లేషకుల నుండి వినపడుతోంది. మినుకుమినుకు మంటున్న వైఎస్సార్‌సీపీ నాయకుల ఆశలను జగన్ చేజేతులా వమ్ము చేస్తున్నారని, పార్టీకి ఊపొచ్చే సమయంలో ఆయనే స్వయంగా తన వ్యాఖ్యలతో అడ్డుపడుతున్నారనే విమర్శలు కూడా జోరందుకుంటున్నాయి.

## బాధితుడినని చెప్పే క్రమంలో దొరికిపోయారా..?

వైఎస్ రాజారెడ్డి, వైఎస్ రాజశేఖర్‌రెడ్డి, వైఎస్ వివేకానందరెడ్డి.. జగన్ తాత, తండ్రి, బాబాయ్ అయిన ఈ నేతలంతా వివిధ సందర్భాల్లో వివాదాస్పద రీతిలో మరణించిన మాట వాస్తవమే. నిజానికి వైఎస్ రాజారెడ్డికి 1960 దశకాల్లోనే రౌడీ షీట్ ఉందని పులివెందుల సహా రాయలసీమలో జరిగిన అనేక అల్లర్లు, దౌర్జన్యాలు, హత్యలు ముఠా తగాదాల్లో ఆయన ప్రత్యక్ష, పరోక్ష ప్రమేయం ఉందన్నది తెలుగుదేశం నాయకుల మాట. దశాబ్దాలుగా వైఎస్ కుటుంబం ప్రస్తావన వచ్చినప్పుడల్లా వైఎస్ రాజారెడ్డి అక్రమాలు అన్యాయాలను టీడీపీ నాయకులు తెరముందుకు తేవడం సర్వసాధారణంగా మారింది. జగన్ పాలనా కాలంలో రాజారెడ్డి రాజ్యాంగం నడుస్తోందని రాష్ట్రమంతా తెలుగుదేశం పార్టీ నాయకులు ఇంటింటికీ ప్రచారం చేసి విమర్శలు సైతం గుప్పించారు. ఇక వైఎస్ రాజశేఖర్ రెడ్డి హెలికాప్టర్ ప్రమాదంలో మరణించడంపై అనేక ఊహాగానాలు తెరమీదికి వచ్చాయి. ముఖ్యంగా కేజీ బేసిన్‌లో గ్యాస్ నిక్షేపాలను కొట్టేయడం కోసం రిలయన్స్ సంస్థ అధినేతలే వైఎస్సార్ మరణానికి కారణమయ్యారంటూ రాష్ట్రవ్యాప్తంగా గతంలో పెద్దఎత్తున ఆ సంస్థ ఆస్తుల విధ్వంసం జరిగింది. అయితే, జగన్ మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక వైఎస్సార్ మరణం గురించి కనీసం మాట మాత్రంగానైనా ఒక్కసారి కూడా ప్రస్తావించకపోవడం, పైపెచ్చు రిలయన్స్ అధినేత ముకేష్ అంబానీ సూచించిన పరిమళ్ నత్వానికి రాజ్యసభ ఎంపీ పదవి ఇవ్వడం పెద్దఎత్తున విమర్శలకు దారితీసింది. ఇలాంటి పరిస్థితుల్లో జగన్ తాజాగా ప్రెస్‌మీట్ పెట్టి మరీ తన తండ్రి మరణానికి చంద్రబాబే పరోక్ష కారణమంటూ వ్యాఖ్యానించడం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. పైగా తమది నిందితుల కుటుంబం కాదు బాధితుల కుటుంబం అంటూ మాట్లాడడం సంచలనం కలిగించింది. జగన్‌కు ప్రతిపక్షంలో ఉన్నప్పుడే తన తండ్రి మరణంపై సందేహాలు వస్తాయని, బాధితుల కుటుంబం అంటూ వాపోయే జగన్ తన హయాంలో వైఎస్ఆర్ మరణంపై ఎందుకు దర్యాప్తు జరిపించలేదని టీడీపీ నాయకులే కాకుండా తటస్థులు సైతం ప్రశ్నిస్తున్నారు. మనం ఇతరుల వైపు ఒక వేలు చూపిస్తే మిగిలిన నాలుగు వేళ్లు మనల్ని చూపిస్తాయనే కనీస పరిజ్ఞానం లేకుండా జగన్ ఇష్టారాజ్యంగా ప్రెస్‌మీట్‌లు పెట్టి తన రాజకీయ గొయ్యిని తానే మరింతగా తవ్వుకుంటున్నాడని విశ్లేషకులు సైతం విమర్శిస్తున్నారు. బాధితుడిగా చెప్పుకుంటున్న జగన్ తండ్రి అధికారాన్ని అడ్డం పెట్టుకుని ఎన్ని అక్రమాలు చేశారో.. అదే తరహా ప్రెస్‌మీట్‌లతో తెలుగుదేశం నాయకులు కళ్లకు కట్టినట్లు జనానికి చూపిస్తున్నారు.


## వివాదాల చట్రంలో!

వైఎస్ వివేకానందరెడ్డి హత్య విషయానికి వస్తే లెక్కలేనన్ని జిమ్మిక్కులు ట్విస్టులు ఈ కేసులో ఉన్నాయంటే అతిశయోక్తి కాదు. సస్పెన్స్ క్రైమ్ థ్రిల్లర్‌ను తలపించే ఈ కేసులో ప్రధాన నిందితులంతా జగన్ చుట్టూ ఉన్న కోటరీలోని నాయకులే అనడంలో అనుమానం లేదు. ముఖ్యంగా వైఎస్ అవినాష్‌రెడ్డి ఈ కేసులో నిందితుడిగా విచారణను సైతం ఎదుర్కొంటున్నారు. గత ఎన్నికల్లో జగన్ ఓటమికి గల ప్రధాన కారణాల్లో వైఎస్ వివేక హత్య కేసు కూడా ఒకటనడంలో సందేహం లేదు. పైగా స్వయంగా వైఎస్ వివేకనందరెడ్డి కుమార్తె సునీత సైతం నిందితులైన అవినాష్‌రెడ్డి, ఆయన తండ్రి భాస్కర్‌రెడ్డిని జగనే కాపాడుతున్నారని ఆరోపించారు. కోర్టుల్లో సైతం పిటిషన్లు దాఖలు చేశారు. జగన్ హయాంలో సీబీఐని సైతం రాష్ట్రంలోకి రాకుండా అధికారులను భయభ్రాంతులకు గురిచేశారని కూడా సునీత దుమ్మెత్తిపోశారు. ఇలాంటి పరిస్థితుల్లో జగన్ తాజాగా ప్రెస్‌మీట్ పెట్టి మరీ వైఎస్ వివేకానందరెడ్డి హత్యకేసును ప్రస్తావించడమేకాక తానే బాధితుడినంటూ రివర్స్‌లో మాట్లాడడం రాజకీయవర్గాలని ఆశ్చర్యపరచింది. స్తబ్దుగా ఉండే రాష్ట్రంలో ఫ్యాక్షన్ రాజకీయాల ప్రస్తావన తేవడం అంటే తన పాలిట అది ఆత్మహత్యాసదృశ్యమవుతుందే తప్ప వైఎస్సార్‌సీపీకి ఎలాంటి మైలేజ్ తీసుకురాదన్న కనీస లాజిక్‌ను కూడా జగన్ గుర్తించడం లేదనే విమర్శలు అన్ని వర్గాల నుంచి వినిపిస్తుండడం గమనార్హం. వివాదాల చట్రంలో వున్న వైసీపీ అధినేత కొంత కాలం ఎంత మౌనం పాటిస్తే ఆయనకి అయన పార్టీకి అంత మంచిదన్నది మేధావుల అభిప్రాయం.

## ఎందుకంత ప్రైవేటు సెక్యూరిటీ?

హత్యా రాజకీయాలకు తమకు తెలీవని, తాను అలాంటి కోవలోని నాయకుడి కాదని చెప్పే జగన్ ఎందుకంతగా భయపడి తాడేపల్లి ప్యాలెస్‌లో ఆకాశమెత్తుండే గోడలతో భద్రతా చర్యలు తీసుకున్నారని, విద్యుత్ కంచెలు, బారికేడ్లతో నిత్యం సహవాసం చేస్తున్నారని టీడీపీ నాయకులు ప్రశ్నిస్తున్నారు. ఎవరి ప్రాణాలనూ హరించని జగన్ ఎందుకు నిత్యం ప్రాణభయంతో తనచుట్టూ వందలాది మంది ప్రైవేటు సెక్యురిటీని పెట్టుకుని ప్రయాణాలు, పర్యటనలూ చేస్తున్నారని ఎద్దేవా చేస్తున్నారు. బాబాయ్ గొడ్డలి వేటుతో తనకే సంబంధం లేదని చెబుతున్న జగన్ ఎందుకు వివేక హత్య కేసులో ప్రధాన నిందితులైన అవినాష్, భాస్కర్‌రెడ్డిని కంటికి రెప్పలా కాపాడుతున్నారో చెప్పాలని నిలదీస్తున్నారు. అధికారంలో ఉన్నప్పుడు కనిపించని తాత, తండ్రి, బాబాయ్ మరణాలు ప్రతిపక్షంలో ఉన్నప్పుడు మాత్రం గుర్తుకొస్తున్నాయా..? అంటూ విమర్శల వర్షం కరిపిస్తున్నారు.

ఏదేమైనా ఒక్కటి మాత్రం నిజం. రాష్టంలో ఫ్యాక్షన్ రాజకీయ ప్రస్తావన తీసుకురావడం అంటే.. జగన్ తన పతనాన్ని తానే కోరుకున్నట్లుగానే భావించాల్సి ఉంటుంది. ఎందుకంటే పుష్కర కాలానికి పైగా 31 కేసుల్లో నిందితుడిగా బెయిల్‌పై ఉన్న జగన్ మోసం గురించి, అవినీతి గురించి మాట్లాడడం ఆయన ఇమేజ్‌నే డ్యామేజ్ చేస్తుందని విశ్లేషకులు సైతం వ్యాఖ్యానిస్తున్నారు. తనకు మైనస్‌గా మారే అంశాలనే జగన్ స్వయంగా ప్రస్తావించడం తన పార్టీపై ఉన్న విమర్శలను, ఆరోపణలను ఎదుటి పార్టీలకు ఆపాదించాలని చూడడం మాత్రం రాజకీయ అపరిపక్వత తప్ప మరొకటి కాదని వైసీపీ శ్రేణులే తలపట్టుకుంటున్నారు. తొందరపాటుతో జగన్ రాజకీయంగా తప్పటడుగులు వేస్తున్నారని విమర్శ సర్వత్రా వినిపిస్తోంది. పదవిపై ఆరాటంతో అర్థంలేని పోరాటాలు చేస్తున్నారన్న అభిప్రాయం సైతం రాజకీయవర్గాలలో వ్యక్తమవుతోంది...!



తన జన్మదినాన్ని పురస్కరించుకొని ఈ నెల 3వ తేదీ విజయవాడలోని సీఎం క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుని కలిసి ఆశీర్వాదం తీసుకొంటున్న గూడూరు ఎమ్మెల్యే డాక్టర్ పాశిం సునీల్‌కుమార్

# 7న.. 'మట్టిమనిషి' నాటకం

నెల్లూరులోని శ్రీ కస్తూర్బా కళాక్షేత్రంలో జూన్ 7వ తేదీ సాయంత్రం 5.45 గంటలకు 'మట్టిమనిషి' నాటకాన్ని ప్రదర్శించ నున్నారు. ఆ పోస్టర్లను ఇటీవల నాటక నిర్వహణ కమిటీ కన్వీనర్ చిరసాని కోటిరెడ్డి.. వ్యవసాయశాఖ జాయింట్ డైరెక్టర్ సత్యవాణి.. ఆత్మ ప్రాజెక్టు డైరెక్టర్ శారద ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ప్రముఖ రచయిత్రి డాక్టర్ వాసిరెడ్డి సీతాదేవి రచించిన 'మట్టిమనిషి నవల బహుళ ప్రజాదరణ పొందింద న్నారు. రైతన్నల జీవితాలను ఆవిష్కరించే ఆ నవల 14 భాషల్లోకి అనువదింపబడిందని, దానిని నాటకంగా కూడా ప్రదర్శిస్తున్నారని తెలిపారు. 50 మంది నటులు.. సాంకేతిక సిబ్బంది పాల్గొనే 'మట్టిమనిషి' నాటక ప్రదర్శన అద్వితీయంగా ఉంటుందని, అందరూ తిలకించి ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని వారు కోరారు.



ఇటీవల నెల్లూరులో జరిగిన బ్రాహ్మణ సదస్సులో సత్కారం అందుకుంటున్న సాహితీ ప్రపూర్ణ మరుమాముల దత్తాత్రేయశర్మ

# ధీరవనిత..పొణకా కనకమ్మ!



## కీర్తిమూర్తులు

***ఊ**యలలూగించే కోమల కరాలే ..రాజ్యాలను శాసిస్తవి!*

*తూలికపట్టే మృదు హస్తాలే ..శతఘ్నులు విదలిస్తవి!*

***జోలలుబుచ్చే సుకుమారపు చేతులే..జయభేరులు మోగిస్తవి...*** అన్న పొణకా కనకమ్మ మాటలు ఆమె జీవితంలో అక్షర సత్యాలు. సుదీర్ఘ భారత స్వాతంత్ర్యోద్యమంలో, అందులోనూ నెల్లూరుజిల్లా స్వాతంత్ర్య సంగ్రామ చరిత్రలో పొణకా కనకమ్మ పాత్ర ఎంతో విశిష్టమైనది. మహాత్మా గాంధీకి శిష్యురాలుగా విదేశీ వస్తు బహిష్కరణ, ఉప్పు సత్యాగ్రహం ఉద్య మాలలో పాల్గొనడమే కాక బ్రిటీష్‌వారి పాలనకు వ్యతిరేకంగా ఉద్యమాలు నడిపారామె. ఫలితంగా జైలు జీవితాన్ని కూడా అనుభవించారు. పల్లిపాడులో పినాకిని సత్యాగ్రహ ఆశ్రమం ఏర్పాటుకు భూమి కొనుగోలు చేసి ఇవ్వడం, జిల్లాలో జమీందారీ వ్యవస్థకు వ్యతిరేకంగా పోరాటం చేయడం, స్త్రీలకు విద్య ఎందుకనే నాటి సమాజంలో బాలికా విద్యకోసం తపిస్తూ, సుమారు వందేళ్ళ క్రితమే నెల్లూరు నడిబొడ్డున కస్తూరిదేవి పాఠశాల ఏర్పాటు చేయడం వంటివి ఆమె జీవితప్రస్థానంలోని ప్రధానమైన మైలురాళ్ళు. తన ఒంటి మీద ఉన్న బంగారు నగలన్నిటినీ స్వాతంత్ర్యోద్య మానికి విరాళంగా మహాత్ముడికి అందజేసిన త్యాగమయి ఆమె. ఆ తర్వాత ఆమె ఇక నగలు ధరించలేదు కూడా.

### స్వాతంత్ర్య సమరంలోకి:

నెల్లూరుజిల్లా తోటపల్లి గూడూరు మండలం పోట్లపూడి గ్రామంలో 1892 జూన్ 10న పొణకా కనకమ్మ జన్మించారు. మరుపూరు కావమ్మ, మరుపూరు కొండారెడ్డి ఆమె తల్లిదండ్రులు. వీరిది సంపన్న కుటుంబం. ఆమెకు 9 ఏళ్ల పసిప్రాయంలోనే తన మేనమామ పొణకా సుబ్బరామిరెడ్డితో వివాహమైంది. ఆమెకు సేవానురక్తి వంశానుగతంగా వచ్చింది. భర్త తోడ్పాటుతో స్వయంకృషితో చదువుకుంది. వెన్నెలకంటి రాఘవయ్య సలహాదారుగా, మరిది పట్టాభిరామిరెడ్డి అధ్యక్షుడిగా 1913లో సుజన రంజని సమాజం స్థాపించారు. వివేకానంద పేరున గ్రంథాలయం కూడా నెలకొల్పారు. ఖద్దరు ఉత్పత్తి, విదేశీ వస్తు బహిష్కరణ, గ్రంథాలయ ఉద్యమ వ్యాప్తికి, సాంఘిక దురాచార నిర్మూలనకు ఈ సంస్థ ఎంతో కృషి చేసింది. ఈ సంస్థ సభ్యులతో కలసి కనకమ్మ స్వాతంత్ర్య సాధనకు కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేసింది. 1907లో బిపిన్ చంద్రపాల్‌ను తన ఇంటికి ఆహ్వానించి రెండు రోజులు ఆతిథ్యం ఇచ్చింది. ఆయన స్ఫూర్తితో స్వాతంత్రోద్యమం వైపు అడుగులు వేసింది.

మొదట్లో విప్లవ భావాలు కలిగిన కనకమ్మ గాంధీజీ దర్శనంతో అహింసా మార్గం వైపు ఆకర్షితులయ్యారు. అహింస, మద్యపాన నిషేధం, చరఖా వడకడం,విదేశీ వస్తు బహిష్కరణ కార్యక్ర మాల్లో చురుకుగా పాల్గొన్నారు. పల్లెపాడు లోని పినాకిని సత్యాగ్రహ ఆశ్రమానికి భూమి కొనుగోలు చేసి ఇవ్వడమే కాక ఆశ్రమం ఏర్పాటులో కీలకపాత్ర పోషించారు. 1921లో ఏప్రిల్ 7న మహాత్మా గాందీ ఆ ఆశ్రమాన్ని సందర్శించారు.

### ఉద్యమాలకు ఊపిరిగా :

అప్పట్లోనే జాతీయ కాంగ్రెస్ సభ్యత్వాన్ని పొందిన తొలి ఆంధ్ర మహిళ కనకమ్మ. నెల్లూరు జిల్లా కాంగ్రెస్ తొలి మహిళా అధ్యక్షురాలు కూడా ఆమే. విదేశీ వస్త్ర బహిష్కరణ, ఉప్పు సత్యాగ్రహం, సహాయ నిరాకరణ ఉద్యమాలలో అరెస్టయి ఆమె జైలు జీవితం గడిపారు.జిల్లాలో జమీందారు లకు వ్యతిరేకంగా జమీందారీ వ్యవస్థ రద్దుకై అలుపెరగని పోరాటం చేసిన ధీరవనిత పొణకా కనకమ్మ. అంతేకాదు, బాలికల విద్య కోసం 1923లో నెల్లూరు నగరంలో పొణకా కనకమ్మ ఎంతో శ్రమించి కస్తూరిదేవి విద్యాలయాన్ని నెలకొల్పారు. ఆ విద్యాలయ భవన నిర్మాణానికి 1929 మే 12న మహాత్మా గాంధీ శంకుస్థాపన చేశారు.

జాతీయోద్యమంలో ఎన్నో ఉద్యమాలు చేసిన పొణకా కనకమ్మ, తన జీవిత చరమాంకంలో ఆధ్యాత్మిక బాట పట్టారు. అన్నారెడ్డిపాలెంలోని రామయోగి ఆశ్రమం, అరుణాచలం రమణ మహర్షి ఆశ్రమంలో కనకమ్మ కొంతకాలం గడిపారు. 1963 సెప్టెంబర్ 15న అనారోగ్యంతో కన్ను మూశారు. దేశం కోసం తన జీవితాన్ని, సంపదను ధారపోసిన ధీరవనిత.. వీరవనిత పొణకా కనకమ్మ. ఆమె చిరస్మరణీయురాలు.

(జూన్ 10.. పొణకా కనకమ్మ జయంతి)



**చల్లా చంద్రశేఖర్‌రెడ్డి**
ఫోన్: 94409 28666




కీ॥శే॥ తుంగా రాజగోపాలరెడ్డి గారు
వ్యవస్థాపకులు, 'లాయర్' వార్తాపత్రిక

లాయర్ 45 YEARS

ప్రతి వారం.. వార్తల సమాహారం
పాఠక జన హృదయాలకు సుమహారం
లాయర్ వార్తాపత్రికకు
45వ వార్షికోత్సవ శుభాకాంక్షలు.

Dr.N.Satyanarayana & G.Krishnamohan's
VISWASAI
NELLORE & TIRUPATI



**కీ॥శే॥ తుంగా రాజగోపాలరెడ్డి గారు**
వ్యవస్థాపకులు, 'లాయర్' వార్తాపత్రిక



**కీ॥శే॥ మాగుంట సుబ్బరామరెడ్డి గారు**
మాజీ పార్లమెంటు సభ్యులు, ఒంగోలు

లాయర్ 45 YEARS

అక్రమాలను ఎదిరించే అక్షర అస్త్రం
అవినీతిపై ఎక్కుపెట్టిన.. బ్రహ్మాస్త్రం

# లాయర్
వార్తాపత్రిక

45 ఏళ్ళ ప్రయాణాన్ని పూర్తి చేసుకొని
46వ యేట అడుగిడుతున్న శుభసందర్భంగా

## 45వ వార్షికోత్సవ శుభాకాంక్షలు.



**మాగుంట శ్రీనివాసులురెడ్డి**
పార్లమెంటు సభ్యులు, ఒంగోలు

Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Magunta Layout, NELLORE-3. Cell: 9866314741. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Managing Editor : **T.BHARATHI REDDY,** Sub-Editor : **MADDURU SRINIVASULU.** e-mail: lawyerpatrika@gmail.com